

అరె..టి మేళా భళా?

అరె అరటిలో ఇన్ని రకాలు ఉన్నాయా.. చూస్తుంటే కొత్తగా ఉందే.. అవును మరి అరటిలో రకాల గురించి అడిగితే ఎవరైనా సరే ఒకటో రెండో రకాలు చెబుతారు.. ఇక్కడ చూడండి ఎన్ని రకాలు ఉన్నాయో.. కొవ్వూరు అరటి పరిశోధన కేంద్రంలో శనివారం కిసాన్ మేళా నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని రకాల అరటి ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు.. అరటి రకాలను చూసి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆశ్చర్యపోయారు. అంతే కాదండోయ్ కంద, చేమ, పసుపు ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు.. పెద్దఎత్తున శాస్త్రవేత్తలు, రైతులు తరలివచ్చారు.

6

కాకినాడ కోర్ట్ నుంచే..!





ఈ అమ్మాయి ఎవరో గుర్తుపట్టారా? ఈమె ఏమైనా సెలబ్రిటీనా గుర్తుపట్టడానికి అంటారా..! అవును సెలబ్రిటీనే.. ఎక్కడా మేం చూడలేదే అంటారా.. అయితే ఇటీవల విడుదలై హిట్ సాధించిన 'కోర్ట్' సినిమా చూడండి.. గ్యారంటీగా గుర్తుపడతారు.. ఎందుకంటే అందులో హీరోయిన్‌గా నటించిన శ్రీదేవి మన కాకినాడకు చెందిన అమ్మాయే.. అదృష్టం ఎవరికి ఏ రూపంలో వస్తుందో ఊహించలేమంటారు కదా.. ఈమెకు అంతే.. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసుకునే అమ్మాయి.. ఒక్కసారిగా హీరోయిన్‌గా మారిపోయింది.. హీరో నాని నిర్మాతగా తీసిన కోర్ట్ సినిమాలో అవకాశం దక్కింది. తొలి సినిమాతోనే హిట్ కొట్టింది.. ఈ సందర్భంగా ఆమెను 'ఆంధ్రజ్యోతి' పలకరించగా పలు విషయాలు చెప్పుకొచ్చింది..

6

2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

అధికారులతో సమీక్షలో జేసీ

రాజమహేంద్రవరంరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 రబీసీజన్‌లో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా కార్యాచరణ అమలు చేయాలని జేసీ చిన్నరాముడు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో పౌరసరఫరాల, వ్యవసాయ, సహకార, తూనికలు కొలతలు, రవాణా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులతో సమావేశం నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసేలా రైతు సేవా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకు రావాలని తెలిపారు. ఏప్రిల్ 1 నాటికి 216 రైతు సేవా కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కొనుగోళ్ల విషయంలో ఎస్‌వోపీ ఖచ్చితంగా పాటించాలన్నారు. మిల్లర్లు, జిల్లా యంత్రాంగం అంతా అనుసంధానంగా ఉండాలన్నారు. ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్లు సహకారం అందించి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్‌వో ఎస్.భాస్కరరెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి.రాధిక, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు నుంచి ఫోన్ చేశామని..

రూ.1.29 లక్షలు స్వాహా

రాజమహేంద్రవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ఈఎంఐ పేరుతో నగదు స్వాహా చేశారు. హుకుంపేటకు చెందిన శ్రీవిద్య గతేడాది అక్టోబరు 24న ఆదిత్య బిర్లా గ్రూప్ ద్వారా రూ.4లక్షలు లోన్ తీసుకున్నారు. ప్రాసెస్ చార్జీలు పోను రూ.3.76 లక్షలు ఖాతాలో క్రెడిట్ అయ్యింది. అదే నెల 24న ఆమెకు ఓ ఫోన్ వచ్చింది. ఆదిత్య బిర్లా నుంచి మాట్లాడుతున్నామని ఎక్కువగా ఈఎంఐ వేశారని ఇంకా తగ్గుతుందని ఆమెను నమ్మించి బ్యాంకు ఖాతా వివరాలు తెలుసుకున్నారు. మూడు రోజుల తర్వాత తన ఖాతా నుంచి రూ.1.49లక్షలు మాయమయ్యాయని శ్రీవిద్య జాతీయ సైబర్ క్రైం ఫిర్యాదుల నెం.1930కి కాల్ చేశారు. దానిపై బొమ్మూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

7

అంబేడ్కర్, ఎన్‌టీఆర్‌లకు అవమానం

ఆ నాన్నకు పిల్లలను చంపాల్సిన అవసరం ఎందుకొచ్చింది..? ఆ దంపతులకు ఊపిరి తీసుకునేంత కష్టం ఎందుకొచ్చింది..? మరో యువకుడి బలవన్మరణానికి కారణం ఏంటి..? ఈ ప్రశ్నలన్నింటి వెనుక ఉన్నది ఒక్కటే జవాబు అదే అప్పు.. ఆ నాన్న తాను లేకపోతే తన పిల్లలను ఎలా చూస్తారోననే భయంతో తన కంటిని తానే పొడుచుకున్నాడు.. క్షణికావేశంలో కుమార్తెను బలి తీసుకున్నాడు.. జైలు పాలయ్యాడు.. కాకినాడకు చెందిన దంపతులు ఇంటిని నిర్మించి అప్పుల పాలయ్యారు.. ఆ ఇంటిని అమ్మేసినా అప్పులు తీరక గోదావరిలో దూకి తనువు చాలించారు.. కోనసీమ జిల్లా బండార్లంకకు చెందిన బాగా బతికిన ఒక కుటుంబం అప్పులు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది.



దారుణంగా చితికిపోతున్న బతుకులు

- ఆదాయాన్ని మించి ఖర్చులు
- అనవసర ఆడంబరాలు
- పెరుగుతున్న అప్పులు
- నలిగిపోతున్న జనం
- తీర్చలేక బలవన్మరణాలు
- కుటుంబాలూ బలి
- బ్యాంకు రుణాలు అధికమే
- జిల్లాలో రూ.91 వేల కోట్లు
- వ్యక్తిగతం రూ.13 వేల కోట్లు
- ప్రైవేటు అప్పులు అదనం

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఆర్థికంగా చితికిపోయి.. తమ చితిని తామే పేర్చుకొని లోకం విడిచి వెళ్లిపోతున్న వాళ్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ఇవాళ అత్యంత ఆందోళన కలిగించే అంశం. అప్పు అనే రెండక్షరాల ఊబి నుంచి బయటపడే అవకాశాలు కానరాక బలవంతంగా ఊపిరి తీసుకుంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చులు.. సంపాదనకు ఉన్న వ్యత్యాసం ఉసురుతీస్తోంది. నెలంతా కష్టపడితే ఖాతాలో పడే జీతం మూడు రోజుల్లో ఆవిరి అయిపోతూ.. మా మాటేమిటంటూ 27 రోజులు ప్రశ్నిస్తుండడం నడుమ పేద, మధ్యతరగతి జీవితాలు నలిగిపోతున్నాయి. పిల్లలను చంపి, తామూ చావడానికి ధైర్యం కూడగట్టుకుంటున్నారంటే మరణాలను రుణాలు శాసిస్తున్నాయనే వాస్తవం పదేపదే రుజువు అవుతూనే ఉంది. అప్పులు లేని పేద, మధ్య తరగతి జీవులు భూతద్దం పెట్టి వెతికినా ఒక్కరూ కానరాని రోజులు నడుస్తున్నాయి. ఓ పదేళ్ల కిందట ఆత్మహత్యలు చాలా తక్కువ. ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. ఏ కారణాలు చెప్పుకొన్నా ఆర్థిక ఇబ్బందులే అసలు రుగ్మత అనేది ఏవరూ కాదనలేని వాస్తవం. గతంతో పోలిస్తే ఈరోజు పిల్లల స్కూలు ఫీజుల దగ్గర నుంచి ప్లాట్‌ఫాంపై అమ్మకాలు సాగించే అరటి పండ్లతో సహా సుమారు 200 నుంచి 500 శాతం వరకూ ధరలు పెరిగిపోయాయి. నిత్యావసరాలు అంతే. దీంతో మనుగడకు అప్పులు తప్ప వేరే దారి కానరావడం లేదు. గతంలో కుటుంబ కలహాలు ఎక్కువగా ఉసురుతీస్తే ఇవాళ ఆ స్థానాన్ని ఆర్థిక ఇబ్బందులు భర్తీ చేస్తున్నాయి. ఒకప్పుడు ఇల్లు కట్టుకున్నా, కూతురు పెళ్లి చేసినా అప్పులు తప్పవని చెప్పేవారు. ఇవాళ స్కూలు ఫీజు కట్టాలంటే రుణాలకు వెళ్లక తప్పడంలేదు. పోలీసు రికార్డుల ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలో గత ఏడాది 230 మంది, జనవరిలో 30 మంది, ఫిబ్రవరిలో 20 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. అసలు రికార్డులకు ఎక్కనివి ఇంకో అన్ని ఉంటాయని చెబుతున్నారు. ఈ మరణాల్లో సుమారు 70 శాతం మందిని ఆర్థిక ఇబ్బందులే చంపేశాయని తెలుస్తోంది. నెలకు రూ.20 వేల నుంచి రూ. 30 వేలు వస్తున్నా నెలాఖరున అప్పులు చేయాల్సిన పరిస్థితి.

ఎందుకు చంపావ్ నాన్నా..



రాయవరం : తన కంటిని తానే ఎవడైనా పొడుకుంటాడా.. ఈయన అదే చేశాడు.. కన్న పిల్లలనే కాలువలో తోసేశాడు..అయితే కుమార్తె మృతిచెందగా...కుమారుడు బయటపడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరుకు చెందిన పిల్లి రాజు ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఎంతో బాగా బతికాడు.. గ్రామంలో అందినకాడికి అప్పులు చేయడంతోపాటు కొంతకాలం కిందట ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో రొటేషన్ ఆగిపోయింది.. మరోవైపు అప్పులిచ్చిన వారి ఒత్తిడి పెరిగిపోవడంతో చనిపోదామని నిర్ణయించుకున్నాడు.. తను చనిపోతే తన పిల్లల పరిస్థితేంటని ఆలోచించాడు. ఈనెల 17న పిల్లలను తీసుకెళ్లి కాలువలో నెట్టేశాడు.. కుమార్తె మృతిచెందగా కుమారుడు బయటపడ్డాడు. చనిపోదామనుకున్నా ధైర్యం సరిపోలేదు. బంధువుల ఇంటికి వెళ్లగా వారు మందలించడంతో పోలీసుల ఎదుట లొంగిపోయాడు. క్షణికావేశంలో తీసుకున్న తొందరపాటు నిర్ణయం పచ్చని కుటుంబంలో తీరని శోకం మిగిల్చింది. ఏడేళ్ల అల్లారు ముద్దుగా పెంచి ఎందుకు ఆయువు తీశావు నాన్నా.. అంటూ చిన్నారి ఆత్మ ఘోషిస్తోంది.

అనవసర ఆర్భాటాలతోనూ..

దురాశ.. దుఃఖానికి చేటు అనే విషయాన్ని జనం గుర్తించకపోవడం మరో కారణం. పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్టుగా.. ఎదుట వ్యక్తి సంపాదించేస్తున్నాడు. మనం కూడా ఏదో ఒక రకంగా సంపాదించాలి. ఖరీదైన బైక్‌లు కొనేయాలి. లగ్జరీ కార్లలో తిరిగేయాలనే అత్యాశకు, అనవసర బిల్డప్‌కు పోయి కొందరు చిక్కులు తెచ్చుకుంటున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు యువత వ్యసనాలకు బానిసవుతున్నారు. బెట్టింగ్, ఇతరత్రా జూదక్రీడలకు అలవాటు పడుతున్నారు. వీటిలో సంపాదించింది గోరంతైతే.. పోగొట్టుకునేది కొండంత. స్టాక్ మార్కెట్లు, షేర్లలో డబ్బులు పెట్టిన వారు ఎందరో నష్టాల బారినపడుతున్నారు. ఇవన్నీ బయటకు చెప్పుకోలేక లోలోపల సతమతవుతున్నారు. చేసిన అప్పులకు వాయిదాలు కట్టలేక కొత్త అప్పులు చేస్తున్నారు. ఇలా అప్పుల మీద అప్పులు చేసి కొందరు చివరకు ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఆర్థికంగా అగచాట్లు..

కొవిడ్ 19 తర్వాత చాలా మంది ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యాయి. కొన్నిచోట్ల పరిశ్రమలు మూతపడడం, చాలామంది ఉద్యోగాలు పోవడం.. చేసేందుకు పని కూడా దొరకని పరిస్థితి. చేసిన అప్పులు తీర్చలేక.. కొత్త అప్పు పుట్టక నానాయాతనపడ్డారు. మరోవైపు ఇదే సమయంలో అప్పులు ఇచ్చే ఫైనాన్షియర్లు కూడా సరైన హామీదారులు ఉంటేనే అదీ కూడా బాగా తెలిసిన వారైతేనే రుణాలు ఇస్తుండడంతో చాలా మంది ఆర్థిక అగచాట్లు పడుతున్నారు. మరోవైపు బ్యాంకులు కూడా సిబిల్ స్కోర్ బాగుంటేనే లోన్లు మంజూరు చేస్తుంటే.. అవీ సరిగా లేని సామాన్యులు నలిగిపోతున్నారు.

ఉమ్మడి జిల్లా బ్యాంకుల్లో రుణాలు

రూ.91,089 కోట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలాది కుటుంబాలు పలు కారణాలతో బ్యాంకుల వద్ద వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్నారు. ఇది కాకుండా ఫైనాన్స్ కంపెనీలు, బంగారంపై రుణాలు ఇచ్చే సంస్థలు, వ్యాపారులంతా కలిపి ఉమ్మడి జిల్లాలోని అన్ని బ్యాంకుల బ్రాంచిల్లో రూ.91,089 కోట్ల రుణాలు తీసుకున్నాయి. కాకినాడ జిల్లాలో రూ.33,844 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.23,514 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో రూ.33,731 కోట్లు. ఈ మొత్తంలో వ్యక్తిగత రుణాలు రూ.13 వేల కోట్లు పైనే. పేద, మధ్య తరగతి కుటుంబాలు బ్యాంకుల కంటే తాకట్టు, వడ్డీ వ్యాపారులు, ప్రైవేటు ఫైనాన్స్‌ల నుంచి తీసుకుంటున్న అప్పులే అధికమని.. ఆర్థిక సమస్యల్లో చిక్కుకుని ఆత్మహత్యల వరకు వెళుతున్న అనేక కుటుంబాల గురించి కాకినాడ జిల్లా బ్యాంకింగ్ నిపుణులు విశ్లేషించడం గమనార్హం.

అప్పులు తీర్చాలని అర్జీలు

కాకినాడలో ఓ పేద కుటుంబానికి చెందిన ఓ వివాహిత తన కుమార్తె వివాహానికి రెండక్షరాలున్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ వద్ద ఇంటిని తాకట్టు పెట్టి రూ.15 లక్షల రుణం తీసుకుంది. ఆ మొత్తాన్ని చెల్లించలేకపోవడంతో ఇంటి జప్తునకు సదరు కంపెనీ నోటీసులు పంపింది. లబోదిబోమన్న ఆమె కంపెనీని వేడుకున్నా కనికరించలేదు. దీంతో ఈనెల 17న గ్రీవెన్స్‌లో కాకినాడ జిల్లా జేసీని కలిసి ప్రభుత్వం ద్వారా తన అప్పు తీర్చాలని వేడుకుంది. అవాక్కయిన జేసీ, లీడ్‌బ్యాంకు మేనేజర్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులను పిలిచి కొంత సమయం ఇవ్వాలని కోరినా వినకుండా మహిళ ఇంటిని జప్తు చేసేసుకుంది. దీంతో సదరు మహిళ నిలువనీడ కోల్పోయి తీవ్రంగా సతమతమవుతోంది.. ఇలా ఈమే కాదు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలాది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి బతకలేక.. బతుకుబండి ఈడ్చలేక నరకయాతన పడుతున్నాయి. తమ ఆర్థిక భారాన్ని ప్రభుత్వం తీర్చు తుందేమోననే అమాయకపు ఆశతో కొందరు జీవిస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు పలు అర్జీలు రావడమే నిదర్శనం. ఈ తరహా విజ్ఞప్తులు పిఠాపురం నియోజకవర్గం నుంచి భారీగా వెళ్లడంతో ఆమధ్య డిప్యూటీ సీఎం పవన్ సైతం అప్పులు తీర్చాలంటూ జనం విజ్ఞప్తి లేఖలు రాయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

బతుకు జీవుడా..!

కాకినాడ రూరల్ మండలానికి చెందిన నితీష్ మెడికల్ రిప్‌గా పనిచేసేవాడు.. వచ్చిన ఆదాయం సరిపోక అక్కడక్కడా అప్పులు చేశాడు.. చివరకు తన ఇంటిపై బ్యాంకులో లోన్ పెట్టి చిన్నచిన్న అప్పులు తీర్చేసి.. మిగిలిన సొమ్ముతో మెడికల్ బిజినెస్ చేశాడు. అయినా లాభంలేదు. ఓ పక్క బాకీదారుల ఒత్తిళ్లు, మరోపక్క పూటగడవని పరిస్థితులు.. కుటుంబమంతా కలిసి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. తర్వాత తమకున్న ఇంటిని అమ్మితే గట్టెక్కవచ్చని ఆలోచించారు. సొంతింటిని అమ్మేసి అప్పులు తీర్చేశారు. సామర్లకోట మండలం మాధవపట్నానికి చెందిన నరేంద్ర డిగ్రీ వరకు చదివి ఉద్యోగం కోసం కాకినాడ గాంధీ నగర్‌కు చెందిన వెంకటేశ్వరరావుకు అప్పులు చేసి రూ.5 లక్షల వరకు సమర్పించాడు. ఒకసారి ఢిల్లీలో ఇన్‌కంటాక్స్ ఆఫీసులో ఉద్యోగం అని.. రెండోసారి రాష్ట్ర రాజధాని అమరావతి సెక్రటేరియేట్‌లో ఉద్యోగం చూశానని మోసగించాడు. ఓపక్క ఉద్యోగం పేరుతో మోసపోవడం, అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో ఆత్మహత్యే శరణ్యమని భావించి చివరికి పోలీసులను ఆశ్రయించాడు. వీరేకాదు.. ఎంతో మంది ఆర్థిక పరిస్థితులు తలకిందులై అనేక మంది బతుకు జీవుడా అని కాలం వెళ్లదీస్తున్నారు. కొవిడ్ తర్వాత సగటు జీవిబతుకు చిత్రం పూర్తిగా మారింది. చాలీచాలని వేతనాలు.. పెరుగుతున్న ధరలు అగాధంలోకి నెట్టేస్తున్నాయి.



తొకాడ సభలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే బత్తుల

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెంపు

రాజానగరంలో ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్

రాజానగరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పడితే నీటి ఎద్దడిని నివారించవచ్చని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.ఉపాధి హామీ పథకంలో రాజానగరం మండలం తోకాడ గ్రామంలో సేద్యపు నీటి కుంట (ఫామ్‌పాండ్) నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రధానంగా వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకుని,సేద్యానికి వినియోగించు కునేందుకు నీటి కుంటలు ఎంతో దోహదపడతాయన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నీరు ఎక్కడ సమృద్ధిగా ఉంటుందో అక్కడ అభివృద్ధి సాధ్యమన్నారు. దానికి గోదావరి జిల్లాలే ఉదాహరణ అన్నారు. ఉపాధి పథకంలో ఉచితంగా సేద్యపు కుంటలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ స్థలాల్లో కమ్యూనిటీ ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిం చిం దన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఇంకుడు గుంటల కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎంఏవై పథకంలో భాగంగా మధ్యలో నిలి చిపోయిన గృహ నిర్మాణానికి మంజూరైన తొలి నగదు చెక్కును మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారు వేగి రాజేశ్వరికి అందజేశారు. సమావేశంలో జనసేన, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు బత్తుల వెంకటలక్ష్మి, నీరుకొండ వీరన్న చౌదరి, చాగల్నాడు కాలువ చైర్మన్ అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ వేగిశెట్టి రాజు, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి తదితరులు పాల్గొన్నారు.

బలభద్రపురంలో కేన్సర్ కేసులకు జల్లెడ

- 31 వైద్య బృందాలు ఏర్పాట్లు
- మూడు రోజుల పాటు ఇంటింటా సర్వే
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

అనపర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి అంకాలజిస్టు సూచనల మేరకు ప్రత్యేక వైద్యం అందిస్తామని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఇటీవల అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అసెంబ్లీలో బలభద్రపురం గ్రామంలో వందలాది మంది క్యాన్సర్ బారిన పడి చనిపోతున్నారని ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా శనివారం ఏడుగురు స్పెషలిస్టులు, 8 మంది వైద్యులు, 98 మంది వైద్య సిబ్బందితో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజారోగ్యంపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఇంటింటా సర్వే చేశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ బలభద్రపురం చేరుకుని క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఇంటింటా సర్వేను పరిశీలించారు. 15మంది వైద్యులు, 98 మంది సిబ్బందితో 31 బృందాలుగా ఏర్పాటు చేసి ఇంటింటా సర్వే చేస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు ఈ సర్వే జరుగుతుందన్నారు. గ్రామంలో 2492 గృహాలు ఉన్నాయని 10 వేల జనాభా నివసిస్తున్నారని అన్నారు.ఇప్పటి వరకు సేకరించిన డేటా ఆధారంగా 23 మందికి వివిధ రకాల కేన్సర్ లక్షణాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరికి తదుపరి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. క్యాన్సర్ ప్రభావం ఉండడానికి గల కారణాలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల నుంచి జీజీహెచ్ ఆసుపత్రి నుంచి స్పెషలిస్టులను రప్పించామని తెలిపారు. క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న వారి వివరాలను సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె వెంకటేశ్వరరావు, కాకినాడ జీజీహెచ్ ఎస్పీఎమ్ హెచ్‌వోడీ డాక్టర్ పి సుజాత పాల్గొన్నారు.



బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

కేన్సర్, కిడ్నీ వ్యాధులు నమోదు : నల్లమిల్లి

బలభద్రపురం గ్రామంలో కేన్సర్ బాధితులే కాకుండా కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. చిన్నారులకు కాలేయ సంబంధిత వ్యాధులు సోక డం మరింత ఆందోళన కలిగిస్తుందన్నారు. గత రెండు రోజుల్లో నలుగురు చిన్నారులు వ్యాధి బారిన పడ్డారన్నారు. ఒక బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కూడా జరిగిందని.. తల్లిదండ్రులు సుమారు రూ.75 లక్షలు ఖర్చు చేశారన్నారు. ఒక్క గ్రామంలోనే ఇన్ని రకాల వ్యాధులు ఎందుకు ప్రబలుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. కేన్సర్ స్క్రీనింగ్ టెస్టుల కోసం మరో నోడల్ టీమ్‌ను గ్రామానికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారన్నారు. ప్రజలు నామోషీ పడకుండా వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



సారా నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ చిన్న రాముడు

400 మందిపై బైండోవర్ కేసులు : జేసీ

రాజమహేంద్రవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నవోదయం 2.0ని అమలు చేస్తామని జేసీ ఎస్.చిన్న రాముడు స్పష్టం చేశారు. నవోదయం 2.0 పోస్టర్‌ని శనివారం ఆవిష్కరించి, అధికారులతో సారా నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. సారా తయారీదారులు, రవాణా చేస్తున్న నిందితులను సంస్కరించడం ద్వారా సత్ఫలితాలు సాధించడం సాధ్యమని సూచించారు.సారా తయారీ, రవాణా, విక్రయాలు చేసే సుమారు 400 మందిపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వీరంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొనే విధంగా చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. గంజాయి తదితర నిషేధిత మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృతంగా ప్రచారం చేయడానికి ప్రచార రథాన్ని ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్, డీఆర్డీఏ, సెర్ప్, ఎక్సైజు, మునిసిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6 : 20 (ఆదివారం సాయంత్రం)

సహర్ : 4:43 (సోమవారం ఉదయం)

కాకినాడ నాకు చాలా స్పెషల్!

కథలెన్నో చెప్పారు.. కవితల్ని రాశారు.. కాలాలు దాటారు.. యుద్ధాలు చేశారు ప్రేమలో.. తప్పు లేదు ప్రేమలో..

కొద్దిరోజులుగా ఎక్కడ విన్నా ఇదే పాట.. యూట్యూబ్, ఇన్‌స్టా, రీల్స్.. ఇలా ఏ సోషల్ మీడియాలో చూసినా ఇదే పాటలో వేసిన స్టెప్పుల మోతే.. 'కోర్ట్' సినిమాలో ప్రధాన ఆకర్షణగా అందులో నటించిన యువజంట నిలిచారు. ట్రెండింగ్‌లో రికార్డులు బద్దలుకొట్టారు. ఈ యువజంటలో హీరోయిన్‌గా నటించిన శ్రీదేవి అప్పల సొంతూరు కాకినాడే. సర్పవరంలో ఉండే ఈ టీనేజ్ అమ్మాయితో ఇటీవల 'ఆంధ్రజ్యోతి' జరిపిన చిట్‌చాట్...

'కోర్టు' చిత్రం హీరోయిన్ శ్రీదేవితో చిట్‌చాట్

ప్రశ్న: హాయ్ అండి.. ఎలా ఉన్నారు..

జవాబు : బాగున్నాను అండీ.

ప్ర: మీ కుటుంబ నేపథ్యం గురించి చెప్పండి?

జ: మా అమ్మ నీలిమ అప్పల. నా జీవితానికి అతిపెద్ద స్తంభం. తను ఎప్పుడూ నాకు మద్దతుగా ఉంది. అలాగే మా అక్క ఒక పిల్లర్. ఎప్పుడూ నన్ను గైడ్ చేస్తూ, ప్రోత్సహిస్తూ ఉంటుంది. వాళ్లిద్దరి ప్రేమ, సహాయం లేకుండా నేను ఈ ప్రయాణాన్ని మొదలుపెట్టే అవకాశం ఉండేది కాదు.

ప్ర : మీది కాకినాడేనా..

జ: అవును. కాకినాడలోని సర్పవరంలో ఉంటున్నాం. శ్రీచైతన్య ఇంటర్నేషనల్‌లో టెన్త్ వరకు చదివా. శుభానికేతన్‌లో ఇంటర్. నా బాల్యమంతా కాకినాడలోనే. అందుకే కాకినాడ నాకు చాలా స్పెషల్.

ప్ర : మీ స్నేహితులు టచ్‌లో ఉన్నారా...

జ: ఎందుకు ఉండరు.. నాకు చిన్నప్పటి స్నేహితులు కూడా టచ్‌లో ఉన్నారు. వాళ్లతో కలిసి గడిపే సమయం నాకు చాలా ప్రీషియస్.


కాకినాడ బీచ్‌లో (ఫైల్)

- ఆంధ్రజ్యోతి, కాకినాడ కార్పొరేషన్


శ్రీదేవి



కోర్ట్ చిత్ర నిర్మాత హీరో నానితో అమ్మ నీలిమ, అక్క దివ్యతో శ్రీదేవి

అమ్మ చేతి వంట ఇష్టం..

ప్ర : సినీ రంగంలోకి ప్రవేశం ఎలా జరిగింది..

జ: నాకు చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తి ఉండేది. అది గమనించిన మా అక్క ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేయడానికి ప్రోత్సహించింది. కొన్ని ఆడిషన్ల తర్వాత 'కోర్టు' చిత్రం హీరోయిన్‌గా అవకాశం రావడం నాకు పెద్ద బ్రేక్.

ప్ర : మీ రెగ్యులర్ లైఫ్ స్టైల్ ఎలా ఉంటుంది? మీ హాబీస్..

జ: నా డే స్ట్రిక్ట్ షెడ్యూల్‌లో ఉంటుంది. ఫిట్‌నెస్, డాన్స్, స్క్రిప్ట్ చదవడం అన్నీ ప్లాన్ చేస్తాను. హాబీస్‌లో ట్రావెలింగ్, మ్యూజిక్ వినడం ఇష్టం.

ప్ర : గోదావరి జిల్లాల్లో ఏ ప్రాంతాల్లో, ఏ ఫుడ్ అంటే మీకు ఇష్టం..

జ: నాకు ఇంట్లో అమ్మ వండిన వంటకాలు ఇష్టం. పూర్తిగా శాకాహారి అయిన నేను హోం కుక్‌డ్ ఫుడ్‌ను ప్రిపర్ చేస్తాను. గోదావరి జిల్లాలోని పచ్చళ్ల, ప్రత్యేకమైన వంటకాల రుచి మరుపురాని అనుభూతినిస్తాయి.

శ్రుతిహాసన్.. నాకు ఇన్‌స్పైరింగ్

ప్ర : మీ అభిమాన హీరో, హీరోయిన్లు..

జ: నాకు పవన్‌కల్యాణ్‌గారి స్టైల్, నాని గారి నేచురల్ యాక్టింగ్ చాలా ఇష్టం. హీరోయిన్లలో శ్రుతిహాసన్ వర్క్ నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా ఉంటుంది.

ప్ర: మీ డ్రీమ్ ఏంటి? ఎవరితోనైనా కలిసి వర్క్ చేయాలని ఉందా..

జ: నా డ్రీమ్ మంచి పాత్రలతో ప్రేక్షకుల గుండెల్లో ఉండాలి. డైరెక్టర్ రాజమౌళి గారి సినిమాలో నటించాలన్నది నా కల.

ప్ర: ప్రస్తుతం ఏ ప్రాజెక్టులు చేస్తున్నారు..

జ: ప్రస్తుతం కొత్త ప్రాజెక్టు అంగీకరించా. ఆ మూవీకి వర్క్ చేస్తున్నాను. త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వస్తుంది.


అక్క దివ్యతో

ఆ స్టెప్ కోసం.. పది నిమిషాలే..

ప్ర : కోర్ట్ సినిమాలో మీకు బాగా గుర్తింపు తెచ్చిన జాబిలి పాత్ర కోసం మీ అభిప్రాయం..

జ: జాబిలి పాత్ర నాకు చాలా స్పెషల్. ఆ పాత్రలో భాగోద్వేగాలను డీప్‌గా చూపించే చాలెంజింగ్ రోల్. ప్రేక్షకుల స్పందన నన్ను మరింత ఉత్సాహపరిచింది.

ప్ర : కోర్ట్ మూవీలో మీరు హీరోయిన్‌గా చేయడాన్ని ఎలా ఫీల్ అవుతున్నారు..

జ: ఇది నా కెరీర్‌లో ఒక గొప్ప మైలురాయి. నా మీద నమ్మకంతో ఈ పాత్రను ఇచ్చిన నానిగారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. ఈ ఛాన్స్ నాకు దొరకడం, దర్శకుడి గైడెన్స్‌లో నటించడం, ప్రేక్షకుల ప్రేమ పొందడం ఇవి అన్నీ నాకు మరిచిపోలేని అనుభవాలు.

ప్ర : షూటింగ్‌లో మీకు ఏమనిపించింది.. మీతోటి యాక్టర్స్ సహకారం ఎలా ఉంది..

జ: షూటింగ్‌లో మా టీమ్ సపోర్ట్ చాలా బాగా లభించింది. నటనలో వాళ్ల నుంచి నేర్చుకోవడం ఒక మంచి అనుభవం.

ప్ర : ప్రమోషన్‌లో భాగంగా మీరు వేస్తున్న స్టెప్పు ఎన్ని రోజులు నేర్చుకున్నారు..

జ: నిజం చెప్పాలంటే ఆ స్టెప్పును నేర్చుకోవడానికి నాకు కేవలం పది నిమిషాలే పట్టింది. డ్యాన్స్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే త్వరగా గ్రాసెప్ చేసుకోగలిగాను. ఆ స్టెప్ బాగా క్లిక్ అవడంతో ప్రమోషన్‌లో భాగంగా ఆ స్టెప్ అందరితో కలిసి వేస్తున్నా.


మోతుగూడెంలో...


మండపేట బైపాస్‌లో..

ప్రకృతి రమణీయత

చింతూరు మండలం మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టు, పర్యాటక ప్రాంతాలైన పోర్ బై జలాశయాల, సీలేరు నది పొడవునా ప్రకృతి రమణీయ దృశ్యాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. తొలి, మలి సంధ్య వేళ ఉషా కిరణాలు జలాశయాన్ని తాకినప్పుడు ప్రకృతి చిత్రాలు సాక్షాత్కరిస్తున్నాయి. ప్రస్తుతం జలాశయం సందర్శనకు వెళ్లినవారంతా వీటిని చూసి పులకించిపోతున్నారు. అలాగే మండపేట బైపాస్‌లో శనివారం సాయంత్రం సూర్యుడు అస్తమిస్తూ ప్రకృతి ప్రేమికులను ఇలా ఆహ్లాదపరిచాడు.. ఈ దృశ్యాలు శనివారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.

- మండపేట, మోతుగూడెం, (ఆంధ్రజ్యోతి)

నిరుద్యోగ సమస్య పరిష్కారమే లక్ష్యం

● కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ● ఐడీఎల్‌లో ముగిసిన జాతీయ స్థాయి సదస్సు



రూరల్ ఎమ్మెల్యే నానాజీని సత్కరిస్తున్న అతిథులు, డైరెక్టర్లు

కాకినాడ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడీఎల్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి సదస్సు శనివారం సాయంత్రంతో ముగిసింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ విద్యార్థులు చదువును కేవలం ఉద్యోగాలుచేయడానికే కాదని, స్వయం ఉపాధి, వ్యాపార సంస్థలు నెలకొల్పడం మీదా దృష్టి కేంద్రీకరించాలన్నారు. కళాశాలల్లో విద్యార్థులకు భద్రత, వనరుల కల్పన కోసం తాను విద్యాశాఖ మంత్రికి తెలియజేశానన్నారు. జిల్లా పరిశ్రమల శాఖాధికారి సీహెచ్ గణపతి, జే.పాండురంగారావు, రామకృష్ణ, యమున, వీవీఎస్ఆర్, శివరామకృష్ణ తదితర ప్రొఫెసర్లు ప్రసంగించారు. కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, గవర్నింగ్ బాడీ కార్యదర్శి పీఎస్‌కిరణ్, అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు ఎం.రంజిత్, కేఎస్ వాసు, ప్రిన్సిపాల్ టీ.సత్యనారాయణ, కన్వీనర్ స్టీవెన్‌రాజు, విభాగాధిపతులు ఈశ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొనగా ఉపన్యాసకులకు, విద్యార్థులకు సర్టిఫికెట్లను అతిథుల చేతులమీదుగా అందజేశారు.

జాతీయస్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్

● సివిల్ విభాగం ఆధ్వర్యంలో సొధ- 2 కే 25 పేరుతో నిర్వహణ



టెక్‌ఫెస్ట్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద్, అతిథులు

జేఎన్టీయూకే, మార్చి22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ (కే) వర్సిటీలోని యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సొధ- 2 కే 25 పేరుతో రెండురోజుల పాటు జాతీయ స్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా కేఎస్‌పీఎల్ డీజీఎం పీ.రవికుమార్, ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ విశిష్ట అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి, సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ స్టార్టప్‌లకు టెక్‌ఫెస్ట్‌లు మంచివేదికగా నిలుస్తాయన్నారు. దేశం మొత్తం మీద తొలుత ఇక్కడే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోర్టు కార్యకలాపాలను పర్యవేక్షించడం జరుగుతున్నదన్నారు. అనంతరం వీసీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ టెక్ ఫెస్ట్‌లు దోహదపడతాయన్నారు. వచ్చేఏడాదికి 1500 మంది సీటింగ్ సామర్థ్యంతో నిర్మిస్తున్న ఆడిటోరియం అందుబాటులోకి రానున్నదన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రాజెక్టులు, వర్క్‌షాప్స్ పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, ఎగ్జిబిషన్స్‌ను ఉపకులపతి సందర్శించారు. విద్యార్థులకు డ్రోన్ ప్రజంటేషన్, స్పాట్ ఈవెంట్స్, టెక్నికల్ క్విజ్, తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓఎస్డీ కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులు తయారు చేసిన హైడ్రో ఎలక్ట్రిక్ డ్యామ్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న వీసీ

గోవిందా... గోవింద

» వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

» స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.52.39 లక్షలు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరు మల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వి విధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవలద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.52,39,730 లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. మండువేసవిలో ఎండవేడిని సైతం లెక్కచేయకుండా స్వామివారి ప్రదక్షణలు ముగించుకుని గంటల తరబడి క్యూలైన్లలో ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు స్పృహకోల్పోగా వైద్య సిబ్బంది సేవలు అందించారు.

కేశవస్వామిని దర్శించుకున్న ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్

పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ వైజాగ్ కె.మధుసూదన్ కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు. తొలుతగా ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వాదం అందుకున్నారు. ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు.



ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ఇన్‌కం ట్యాక్సు కమిషనర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

సోమేశ్వరస్వామిని తాకిన సూర్యకిరణాలు

రాయవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి వాయువ్యంలో చంద్రప్రతిష్ఠ శివాలయంగా పేరుగాంచిన మండలంలోని సోమేశ్వరం శ్రీబాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో సోమేశ్వరస్వామి, అమ్మవారిపై శనివారం సాయంత్రం సూర్యకిరణాలు నేరుగా తాకాయి. ప్రతిఏటా మార్చి నెలలో ఫాల్గుణమాసంలో ఒక్కరోజు స్వామి, అమ్మవారి మూలవిరాట్‌పై సూర్య కిరణాలు తాకుతూ ఉంటాయి. శనివారం సూర్యాస్తమయం సమయంలో సూర్యకిరణాలు సోమేశ్వరస్వామిని తాకడంతో ఆలయ అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు, హారతులు నిర్వహించారు. సోమేశ్వరం పరిసర ప్రాంతాల భక్తులు సోమేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


స్వామిని తాకిన సూర్య కిరణాలు

పరీక్షల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

● వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ


పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించిన వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్యలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల పరిధిలోనే ఎక్కువ మంది పరీక్షలు రాస్తారని ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ అన్నారు. అందుకే పరీక్షల నిర్వహణపై కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీకళాశాలల్లో సోమవారం నుంచి డిగ్రీ, బీఈడీ, లా పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలను వీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలం కావడంవల్ల తాగునీరు అందుబాటులో ఉంచాలని, కరెంటు సమస్య లేకుండా శుభ్రమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని యాజమాన్యాలకు సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని 109 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 22 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. అలాగే బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల నిమిత్తం 20 కేంద్రాల్లో 2500 మంది, లా 8, 10 సెమిస్టర్ పరీక్షలకు మూడు కేంద్రాల్లో 500 మంది హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లను కళాశాలల నిర్వాహకులు పర్యవేక్షించాలని తెలిపారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన మద్రాస్ హైకోర్టు జడ్జి

కడియం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) మద్రాస్ హైకోర్టు జడ్జి వి.శివజ్ఞానం శనివారం కడియపులంక పుల్లా అబ్బులు-సత్యదేవా నర్సరీని సందర్శించారు. అబ్బులు ఆగ్లోనిమా సిల్వర్ మొక్కను అందజేసి స్వాగతించారు. నర్సరీలో వివిధ రకాల ఫల, పుష్ప, ఆర్నమెంటల్ మొక్కలను చూశారు. వాటి వివరాలు, శాస్త్రీయనామాలు, మొక్కల పెంపకంపై పుల్లా వీరబాబు, రాజశేఖర్ వివరించారు. వివిధ రకాల మొక్కలు ఒకే చోట చూడడం సంతోషంగా ఉందని జడ్జి శివజ్ఞానం అన్నారు.


మద్రాస్ హైకోర్టు జడ్జి శివజ్ఞానంకు మొక్కను అందజేస్తున్న పుల్లా అబ్బులు

గోదావరి డెల్టాకు సీలేరు నుంచి నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టాలో వ్యవసాయ అవసరాల కోసం సీలేరు నుంచి బైపాస్ మార్గం ద్వారా మరో 1000క్యూసెక్కులు పెంచి 4వేల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా 3వేల క్యూసెక్కులకుపైగా గోదావరికి విడుదల అవుతోంది. దీంతో గోదావరిలో నీటిలభ్యత 10,700 క్యూసెక్కులుగా నమోదయింది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 10,700క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.తూర్పుడెల్టాకు 3200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2000 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5500 క్యూసెక్కులు విడుదల అవుతోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 9.85 నమోదైంది.

జీజీహెచ్‌లో రెండు జీబీఎస్ కేసులు

జీజీహెచ్(కాకినాడ), మార్చి (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో వైద్యసేవలకోసం ఇద్దరు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) బాధితులు చేరినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. ప్రస్తుతం ముగ్గురు బాధితులు చికిత్స పొందుతుండగా, ఇద్దరి చేరికతో మొత్తం ఐదుగురు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

ఏమి హాయిలే ఇలా...

● ఆ రహదారిపై ప్రయాణం కూల్ కూల్

రాజానగరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆ రహదారిలో ప్రయాణం హాయిగా సాగిపోతోంది. ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారులు ప్రయాణికులు మార్గమధ్యంలో ఆగి కొంచెంసేపు చెట్ల నీడన సేదతీరుతున్నారు. రాజానగరం-అనపర్తి ప్రధాన రహదారికి ఇరువైపులా ఫరిజెల్లిపేట సమీపంలోని రంగరాయ చెరువు వద్ద ఉన్న చెట్లు ఉష్ణతాపంతో అల్లాడుతున్న ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. వృక్షాలకు తోడు చెరువు నుంచి వీస్తున్న చల్లని గాలిలో ఏమి హాయిలే ఇలా అనుకుంటూ ఈ రోడ్డుపై వెళుతున్న వాహనదారులతోపాటు గ్రామానికి చెందిన వారు సైతం మధ్యాహ్నం సమయంలో ఇక్కడకు చేరుకుని కొంతసేపు విశ్రమించిన అనంతరం బయలుదేరుతున్నారు.


రాజానగరం-అనపర్తి ప్రధాన రహదారికి ఇరు వైపులా ఫరిజెల్లిపేట సమీపంలోని రంగరాయ చెరువు వద్ద చెట్లు నీడ

రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

» ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

» కొవ్వూరు ఉద్యాన పరిశోధనా కేంద్రంలో కిసాన్‌మేళా-2025


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తదితరులు

కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సహకారాన్ని అందిస్తూ, రైతుల ఆర్థికాబివృద్ధికి తోడ్పాటునిస్తున్నట్టు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు డాక్టర్ వైఎస్ఆర్ హెచ్‌యూ ఉద్యాన పరిశోధన కేంద్రంలో శనివారం కిసాన్‌మేళా-2025 నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డా.కె.గోపాల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతుల సంక్షేమంతోపాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. వైస్ చాన్సలర్ డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యానపంటల ఉత్పత్తి ఎక్కువగా ఉందన్నారు. తక్కువ నీటితో ఎక్కువ లాభాలు ఉద్యాన పంటల తోనే సాధ్యమన్నారు. విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ బి.గోవిందరాజులు మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా పరిశోధనా స్థానంలో అభివృద్ధి చేసిన యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ నిర్వహిస్తామన్నారు. కొవ్వూరు ఉద్యానవన పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి. లలితా కామేశ్వరి మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో 13 లక్షల టిష్యూ కల్చర్ మొక్కలను అందజేశామన్నారు. ఈ మేళా 25లో ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ని పరిశోధనా కేంద్రాలు అంబాజీపేట, పందిరిమామిడి, పెద్దాపురం, కేవీకే వెంకట్రామన్నగూడెం, శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వివిధ ప్రదర్శనలను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామకృష్ణ, దా యన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, అక్షయపాత్ర రవీంద్ర, శాస్త్రవేత్తలు డీ. వెంకటస్వామి, ఏ.స్నేహలత రాణి, రైతులు పాల్గొన్నారు.

గౌరీపట్నంలో ప్రారంభమైన

నిర్మలగిరి మేరీ మాత మహోత్సవాలు



మేరీ మాత మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి జయరావు తదితరులు



నిర్మలగిరిలో ఆలయానికి విద్యుత్ అలంకరణ

దేవరపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గౌరీపట్నంలో నిర్మలగిరి మేరీ మాత మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేరీమాత మహోత్సవాల సందర్భంగా ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పుణ్యక్షేత్రం అఖండ దేవాలయంలో ఏర్పాటు చేసిన బైబిల్ ప్రదర్శనను తిలకించారు. నూతనంగా భక్తుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. నిర్మలగిరి మేరీ మాత మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యావత్ ప్రపంచం సుఖ శాంతులతో ఉండాలనేదే మేరీమాత తల్లి ఆకాంక్ష అని పేర్కొన్నారు. గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు గత 40 ఏళ్లుగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు ప్రేమ, దయ గుణం కలిగి ఉండాలన్నారు. సుఖజీవనం గడపాలని, సుఖశాంతులు అష్టఐశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థన లు చేయడం జరుగుతుందని తెలిపారు. మతాలు, ప్రాంతాలకతీతంగా ఈ ఉత్సవాలు నిర్వహించగా భక్తులు పాల్గొనడం ప్రత్యేకత అన్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, పాదర్లు బాల, ప్రసాద్, నిర్మలగిరి పుణ్యక్షేత్ర అన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు, పలువురు ఫాదర్లు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పెంపు

రాజమహేంద్రవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు, వాడపల్లి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 25 వరకూ ప్రభుత్వం పొడిగించిందని ప్రిన్సిపాల్ వి.ఆనంద్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అనుసరించి 40 సీట్లు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా http: //mjpapbcwreis. apcfss.in వెబ్ సైటులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు

సామర్లకోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట ఉండూరు రైల్వే గేట్ సమీపాన ఎన్‌ఎఫ్‌సీఎల్ పైప్‌లైన్ రోడులో ఆదివారం ఉదయం కుమార రామ భీమేశ్వరా రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు జరుగనున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు చెప్పారు. వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్ పేరిట నిర్వహించనున్న ఈ పోటీలను మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) హాజరవుతారన్నారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు నగదు, షీల్డ్ బహుమతులు, జూనియర్స్‌లో మొదటి అయిదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి సుమారు 32 జతల ఎడ్లు సామర్లకోటకు చేరుకున్నట్టు తెలిపారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఏడుగురిపై కేసు

గొల్లప్రోలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ర్యాష్ డ్రైవింగ్ చేయడమే గాక ప్రశ్నించినందుకు తమపై దాడి చేశారని తాటిపర్తికి చెందిన పేకేటి ప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై పాలికి సుబ్రహ్మణ్యం, బెందుకుర్తి డేవిడ్‌రాజు, బర్రె దుర్గాప్రసాద్, నాగేంద్ర, మరో ముగ్గురు మైనర్లపై కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఎవరెస్టు శిఖరం అధిరోహించడమే లక్ష్యం

భువనగిరిలో ట్రెక్కింగ్ శిక్షణ తీసుకున్న 14 ఏళ్ల అభిరాం





భువనగిరిలో శిక్షణలో భాగంగా ట్రెక్కింగ్ చేస్తున్న అభిరాం

మోతుగూడెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న కొత్తపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ సోడే తిరుపతమ్మ, అప్పారావుల కుమారుడైన 14ఏళ్ల అభిరాం పర్వతారోహణపై మక్కువ పెంచుకున్నాడు. భవిష్యత్తులో ఎవరెస్టు శిఖరం అధిరోహించాలనేదే తన లక్ష్యమని తెలిపాడు. పర్వతారోహణపై మక్కువతో శిక్షణ తీసుకుంటున్నానని, ఆర్థిక సాయం అందితే కిలిమంజారో పర్వతాన్ని విజయవంతంగా అధిరోహిస్తానని ధీమా వ్యక్తం చేశాడు. చింతూరులోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఎవరెస్టు అధిరోహించిన వీఆర్‌పురం మండలం కుంజవారిగూడెంకు చెందిన కుంజా దుర్గారావు స్ఫూర్తి, సూచనలతో అభిరాం కిలిమంజారో పర్వతం ఎక్కాలనుకున్నాడు. అతడి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ఈ నెల 14నుంచి 16 వరకు తెలంగాణలోని భువనగిరిలో ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇప్పించారు. కిలిమంజారో అధిరోహణ ఆర్థికభారంతో కూడుకోవడంతో వారు బుధవారం ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌ను ఆశ్రయించి తమ కుమారుడి ఆశ నెరవేర్చేందుకు ఐటీడీఏ నుంచి ఆర్థిక సాయం చేయాలని కోరారు. స్పందించిన పీవో ముందుగా అభిరాంకు పాస్‌పోర్టు చేయించాలని, ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు బాలుడి తల్లిదండ్రులు తెలిపారు.

అన్నవరం దేవస్థానంలో

లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

అధిక ధరలకు విక్రయిస్తున్న 9మంది వర్తకులపై కేసులు



తనిఖీలు నిర్వహిస్తున్న మెట్రాలజీ అధికారులు

అన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో వివిధ లైసెన్స్‌లు కలిగిన వర్తకసంస్థలపై శనివారం జిల్లా వినియోగదారుల ఫోరం ఆదేశాలు మేరకు 9మంది వర్తకులపై కేసులు నమోదు చేసినట్టు లీగల్ మెట్రాలజీ ఉప నియంత్రకులు యస్.జనార్ధనరావు తెలిపారు. వారిలో ఎమ్మార్పీ ధరల కంటే షాపులలో రూ.5 నుంచి 20 వరకు అధికంగా విక్రయిస్తున్నట్టు గుర్తించామని.. వర్తకులపై లీగల్ మెట్రాలజీ 2009, లీగల్ మెట్రాలజీ ప్యాకేజ్ కమోడిటీస్ నియమావళి 2011 ఉల్లంఘనలు కింద కేసులు నమోదుచేయడం జరిగిందని పేర్కొన్నారు. దాడుల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు సలీం, సరోజినీ, వివిఎస్ వివిఎస్.మోహన్, ఎస్.నాగేంద్రకుమార్, కొమ్మూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రిజిస్ట్రార్‌శాఖ ఉమ్మడి జిల్లా డీఐజీ వెంకటేశ్వరరావు



మండపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఐజీ వెంకటేశ్వరరావు

మండపేట మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రిజిస్ట్రార్‌శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీఐజీ ఎల్.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కోనసీమ జిల్లా మండపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఫిబ్రవరి 22న వేళకు రిజిస్ట్రార్ రాకపోవడంతో కక్షిదారులు తాళం వేసిన సంఘటనపై శనివారం ఆయన విచారణ చేపట్టారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేసిన పోతురాజు సునీత ఫిబ్రవరి 22న మధ్యాహ్నం వరకు కార్యాలయానికి రాకపోవడంతో రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న కక్షిదారులు వేళకు రానపుడు కార్యాలయం ఎందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేసి కార్యాలయానికి తాళాలు వేయించారు. ఆ రోజు విధులకు అలస్యంగా హాజరైన సునీతను శనివారం పిలిపించి విచారణ చేశారు. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. కక్షిదారులకు ఇబ్బందులు కలిగించే చర్యలపై ఉపేక్షించేదిలేదని ఆయన హెచ్చరించారు.

వైభవంగా నూకాలమ్మ గరగల మహోత్సవం

పాల్గొన్న జబర్దస్త్ నటుడు దొరబాబు

అన్నవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్యరోజున జరిగే మండపం నూకాలమ్మను జాతర పురస్కరించుకుని శనివారం కాకినాడ జిల్లా అన్నవరంలో గరగల మహోత్సవం మహిళలు, యువకుల కేరింతల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు మండపం గ్రామం నుంచి 5కిలోమీటర్ల దూరం పూల గరగతో పాటుగా చిన్న గరగలతో నడిచి వచ్చారు. పూలగరగకు మహిళలు బిందెలతో నీళ్లపోసి పసుపు, కుంకుమలు పూసి సారె, చీరలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు రావిచెట్టు సెంటర్‌లో గరగల మహోత్సవం జరిగింది. మండపం నూకాలమ్మ అన్నవరం అత్తివారి ఆడపడుచుగా పూజలందుకోవడంతో ముందుగా వారింటికి చేరుకుని అక్కడ పాన్పు అనంతరం నైవేద్యాలు సమర్పించారు. 2గంటల నుంచి సాయంత్రం 4 వరకు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గరగల సంబరం జరిగింది. జబర్దస్త్ నటుడు దొరబాబు పాల్గొన్నారు.



గరగల మహోత్సవంలో పాల్గొన్న జబర్దస్త్ నటుడు దొరబాబు, గ్రామస్తులు

మహనీయుల విగ్రహాలకు అవమానం

- దూబచర్లలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- రాస్తారోకో నిర్వహించిన అంబేడ్కర్‌వాదులు, మాల మహానాడు నేతలు
- రంగంలోకి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్
- భారీ ఎత్తున పోలీసుల మోహరింపు



దూబచర్ల గాంధీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దృశ్యం



రాస్తారోకో నిర్వహిస్తున్న మాల మహానాడు నేతలు

నల్లజర్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్ల గ్రామ పంచాయితీ పరిధిలోని గాంధీ కాలనీలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశారు. శనివారం ఉదయం చూసిన స్థానికులు మండలంలోని అంబేడ్కర్‌వాదులు, మాల మహానాడు నేతలకు సమాచారం తెలపడంతో వారు భారీ ఎత్తున తరలివచ్చి రాస్తారోకో నిర్వహించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న అదనపు ఎస్పీ సుబ్బారాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సిబ్బందితో హుటాహుటిన చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సంఘటనా స్థలానికి వచ్చి అంబేడ్కర్‌ను అవమానపరిచిన దోషులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. రాస్తారోకో చేస్తున్న వారితో కలిసి రోడ్డుపై కూర్చుని సంఘీభావం తెలిపారు. ఈ విషయంపై మాజీ హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని చెప్పుల దండతో అవమానపర్చారని, అక్కడ నూతన విగ్రహం ఏర్పాటు చేసి పైన షెల్టర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేయకపోతే తామే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డీఎస్పీకి వినతి పత్రం అందించారు. గోపాలపురం జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణ రాజు మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించి శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. డీఎస్పీ, సీసీఎస్ సీఐ అనుకూరి శ్రీనివాస్, దేవరపల్లి సీఐ బియస్ నాయక్, నల్లజర్ల సీఐ విజయశంకర్ అంబేడ్కర్‌వాదులతో చర్చలు జరిపి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బోడిగడ్ల వెంకటేశ్వరరావు, కూరపాటి శ్రీను, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు పిల్లి కాంతరావు, గుదే సుబ్బారావు, బొడిగడ్ల రాంబాబు, శ్రీరాములు, ఆదినారాయణ, కీర్తి రాజు పాల్గొన్నారు.

ముసుళ్లకుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి చెప్పుల దండ

పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, సర్పంచ్ శారదాదేవి

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ముసుళ్లకుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి అవమానం జరిగింది. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేశారు. ఉదయం చూసిన గ్రామస్థులు, టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వెంటనే స్పందించి ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దోషులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు. గ్రామంలో గంజాయి బ్యాచ్ ఎక్కువగా ఉందని, మోటార్ వైర్లు, కోడి పుంజుల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిపై దృష్టి పెట్టాలని అక్కడకు వచ్చిన పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నందమూరి శారదదేవి, రామకృష్ణ, కాకర్ల శేషగిరి, బొలుసు గంగరాజు, బొలుసు సుబ్బారావు, అయినపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన కృష్ణ

గండేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారున శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గండేపల్లికి చెందిన దోనాదుల కృష్ణ(50) మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కృష్ణ హైవే మెయింటెన్స్‌లో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం జాతీయ రహదారిపై వ్యాన్ నిలుపుదల చేసి సేఫ్టీ కోన్లు పెడుతుండగా వెనుక వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో వ్యాన్, లారీకి మధ్యలో ఉండిపోయి కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. కృష్ణకు అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవేపై ఆందోళన..

హైవే అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని మురారి, గండేపల్లి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కృష్ణ మరణంపై స్పందించి న్యాయం చేయాలంటూ ఆయన కుటుంబీకులు, గ్రామస్తులు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. రహదారి శుభ్రపరిచేందుకు కొద్దిపాటి స్థలంలో కోన్లు ఏర్పాటు చేయాలని కాని రెండు కిలోమీటర్ల మేర ఎటువంటి పని లేకపోయిన కోన్లు ఏర్పాటు చేస్తున్నారని, దీని వల్ల ఎంతో మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అనపర్తి ఎర్రకాలువలో యువకుడి గల్లంతు



శివకుమార్ (ఫైల్)

అనపర్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి ఎర్రకాలువలో శనివారం చినపొలమూరు గ్రామానికి చెందిన యువకుడు గల్లంతయ్యాడు. ఎస్‌ఐ శ్రీను నాయక్ వివరాల ప్రకారం.. చినపొలమూరుకు చెందిన కడియాల శివకుమార్(29) శనివారం ఉదయం అనపర్తి పని నిమిత్తం వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో కాలువలోకి దిగి ప్రమాదవశాత్తూ జారిపడి గల్లంతయ్యాడు. స్థానికులు గమనించి కేకలు వేయడంతో చుట్టు పక్కల వాళ్లు వచ్చి రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే శివకుమార్ కాలువలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి అక్కడికి చేరుకుని పోలీసులకు, ఫైర్ అధికారులకు సమాచారం అందించడంతో వారు గాలింపు చర్యలు చేపట్టారు. పొద్దుపోయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో గాలింపు నిలుపుదల చేశారు. శివకుమార్ తండ్రి రాంబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అయినవాళ్లందరూ దూరమై.. ఒంటరి బతుకు భారమై...

తుల్యభాగ డ్రైన్‌లో దూకి మహిళ ఆత్మహత్య





మృతురాలు లక్ష్మి

కరప, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కట్టుకున్నవాడు, కన్నకొడుకులు, అల్లుడు.. ఇలా ఒక్కొక్కరిగా కడతేరిపోతుండడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఒక మహిళ బలవన్మరణానికి పాల్పడింది. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేళంగి ధళమ్మచెరువుగట్టుకు చెందిన బరగాటి లక్ష్మి(59)కి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె సంతానం. వృత్తిరీత్యా పిల్లలందరూ వేర్వేరు గ్రామాల్లో ఉంటున్నారు. అయితే 2019లో లక్ష్మి భర్త సూర్యనారాయణమూర్తి, 2021లో చిన్న కొడుకు, 2023లో పెద్దకొడుకు, 5నెలల క్రితం అల్లుడు అనారోగ్యాలతో మృతి చెందారు. అయినవాళ్లందరూ ఇలా వరుసగా కళ్లముందే కన్నుమూయడంతో లక్ష్మి తీవ్ర మనోవేదనతో బ్రతుకీడుస్తుంది. ఒక్కగానొక్క కుమార్తె తల్లికి దూరంగా అనపర్తిలో ఉంటుండడంతో ఇక ఒంటరితనాన్ని ఎంతమాత్రం భరించలేని లక్ష్మి తనువు చాలించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో యండమూరు గ్రామానికి వెళ్లే దారిలో తుల్యభాగ డ్రైన్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం సాయంత్రం డ్రైన్‌లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చగా మృతురాలు లక్ష్మిగా నిర్ధారణ అయ్యింది. మృతురాలి మనవడు బరగాటి పోతురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తోట సునీత తెలిపారు.

కుందేలును మింగి.. ప్రహరీ గోడ భాగంలో చిక్కి!

పవర్ ప్లాంట్‌లో కొండచిలువ హల్‌చల్





కుందేలును మింగి కదలలేని స్థితిలో ఉన్న కొండచిలువ

గోకవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం బావాజీ పేట గ్రామ సమీపంలో పోలవరం కాలువ గట్టుపై ఉన్న పవర్ ప్లాంట్‌లో శనివారం కొండ చిలువ హల్‌చల్ చేసింది. విధుల్లో ఉన్న ప్లాంట్ సిబ్బందికి కొండ చిలువ కనబడడంతో ఆందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ అధికారి భాస్కర్ కృష్ణ, సిబ్బంది ప్లాంట్ వద్దకు చేరుకుని కొండచిలువను గమనించి స్నేక్ క్యాచర్‌ను రప్పించారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన స్నేక్ క్యాచర్ గంట సేపు శ్రమించి కొండ చిలువను పట్టుకున్నారు. అయితే అప్పటికే కొండ చిలువ కుందేలును మింగి ఉండడంతో కదలలేక ప్లాంట్ ప్రహరీ గోడ అడుగు భాగంలో చిక్కుకుంది. చివరికి కొండ చిలువను పట్టుకుని దేవీపట్నం మండలం దండంగి రిజర్వు ఫారెస్ట్ పరిధిలో వదిలేశారు.

ఇద్దరు మైనర్లపై అత్యాచారయత్నం

దేహశుద్ధి చేసిన స్థానికులు

పెద్దాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మైనర్లపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. స్థానికుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పెద్దాపురంలో వ్యాపారం చేసుకుంటున్న కామేశ్వరరావు శనివారం 2వ, 7వతరగతి చదువుతున్న ఇద్దరు మైనర్ బాలికలపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. బాలికల అరుపులతో అక్కడే ఉన్న స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీనిపై పెద్దాపురం ఎస్‌ఐ మౌనికను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గిరిజనుడి అనుమానాస్పద మృతి

ఆలస్యంగా వెలుగులోకి ఘటన

వై.రామవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం కె.యర్రగొండ గ్రామానికి చెందిన గిరిజనుడు మిరియాల సకురుదొర (38) అనుమానాస్పదంగా మృతి చెందాడు. గురువారం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంకురుదొర గురువారం వాడపల్లి సంతకు వెళ్లి వచ్చి సాయంత్రం కల్లు చెట్లకు వెళ్లాడు. అనంతరం గ్రామంలోకి వచ్చి శివారులో విగతజీవుడైన విషయం ఎవరికీ తెలియరాలేదని కుటుంబీకులు తెలిపారు. గ్రామస్తులు, కుటుంబీకులు మృతదేహాన్ని దహనం చేసేందుకు నిర్ణయించుకోగా పోలీసులకు సమాచారం అందడంతో శనివారం వై.రామవరం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణ పేర్కొన్నారు.

పాము కాటుకు కౌలు రైతు మృతి

కిర్లంపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా మండలంలో ముక్కొల్లు గ్రామానికి చెందిన అనపర్తి కృష్ణ (56) అనే కౌలు రైతు శనివారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి పొలం పనిచేస్తుండగా పాము కాటుకు గురై మృతిచెందినట్టు కిర్లంపూడి హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వెంకటరమణ తెలిపారు. వివరాల ప్రకారం. ముక్కొల్లుకు చెందిన పోతాబత్తుల నందీశ్వరరావు అనే రైతు వద్ద కృష్ణ కౌలు భూమి తీసుకుని సాగు చేసుకుంటున్నాడు. శనివారం తెల్లవారుజామున 5గంటల సమయంలో పొలానికి వెళ్లి పనులు చేసుకుంటుండగా పాముకాటుకు గురయ్యాడు. చుట్టుపక్కల రైతులు గమనించి అతన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ తరలించారు. మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పేర్కొన్నారు.

యానాం సబ్‌జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారీ



పరారైన ఖైదీ వెంకటేశ్వరరావు

యానాం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యానాం సబ్ జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారయ్యాడు. దాదాపు 25 అడుగుల ఎత్తున్న సబ్‌జైల్ ప్రహరీ గోడ దూకి పరారయ్యాడు. యానాం కనకాలపేటకు చెందిన కే.వెంకటేశ్వరరావు ఓ చోరీ కేసులో శుక్రవారం అరెస్ట్ అయ్యాడు. ఈ కేసులో 6 రోజులపాటు రిమాండ్ విధించారు. దీంతో శనివారం ఉదయం సబ్ జైలుకు తరలించగా మధ్యాహ్నం జైలు నుంచి పరారవ్వడం అధికారులను కంగుతినేలా చేసింది. అతడి కోసం యానాం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

జాబ్ మేళాలను వినియోగించుకోండి

సంకల్ప జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో జేసీ చిన్నరాముడు



జాబ్‌మేళా ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న సంకల్ప జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సంకల్ప జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నిత్యం నైపుణ్యం పెంచుకోవడం ద్వారా మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. మెగా జాబ్‌మేళాలో 36 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయని అన్నారు. ఆయా కంపెనీలకు అవసరమైన నైపుణ్య శిక్షణా కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీజీడీ మురళి, జిల్లా ఉపాధి కల్పనాధికారి హరిశ్చంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, అధిక సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

ముగిసిన నైపుణ్య శిక్షణ

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన మహిళా ఉద్యోగ నైపుణ్య శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ప్రతి విషయాన్ని నిర్దిష్టమైన దృష్టితో కాకుండా ఆ గీతదాటి చూడగలిగితే కొత్త కొత్త పరిశోధనలకు నాంది పలికిన వారు అవుతారన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ నాంది ఫౌండేషన్‌కు చెందిన వి.చైతన్య, టీటీపీ సమన్వయకర్త నూజిల్ల శ్రీనివాస్, జేకేసీ మెంటర్ ఎం.కిరణ్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళా నైపుణ్యంతోనే జీవన వికాసం



చిత్ర కళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రౌతు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చిత్ర కళా రంగంలో సాధించిన నైపుణ్యం మనిషి జీవన వికాసానికి దోహదం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. క్రియేటివ్ వరల్డ్ ఆధ్వర్యంలో కళాస్మృతి పేరుతో దివంగత చిత్ర కళాకారుడు గువ్వల కెనడీ స్మారకార్థం శనివారం స్థానిక గౌతమ ఘాట్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల చిత్ర కళా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రౌతు మాట్లాడుతూ కెనడీ చిత్రించిన కళా ఖండాలు అద్భుతమైనవని, ఆయన చిత్ర కళా వారసత్వాన్ని వారి భార్య, పిల్లలు కొనసాగించడాన్ని అభినందించారు. కళాస్మృతి నిర్వాహకులు గువ్వల పద్మ, హిమబిందు వర్మ మాట్లాడుతూ తమ సంస్థలోని 26మంది కళాకారులు వేసిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచామని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 81238 87582కు సంప్రదించాలని కోరారు.

'ఎస్సీ ఉపకులాలకు సమన్యాయానికే వర్గీకరణ'

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాలకు సమన్యాయం కోసమే వర్గీకరణ చేస్తున్నారని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యార్లగడ్డ శేఖర్ శనివారం ఓ ప్రకటనలో అన్నారు.ఎన్నికల హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిలకు ధన్యవాదాలు తెలిపారు. 1995లోనే ఎస్సీవర్గీకరణ చేసిన మొదటి ముఖ్యమంత్రి చంద్రబాబే అని గుర్తుచేశారు. మాదిగ దండోర వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ 30 ఏళ్ల పోరాట ఫలితంగానే ఏబీసీడీ వర్గీకరణ ఏర్పడుతుందన్నారు.

రోగులకు సేవలందించడంలో నర్సులు కీలకం

ఫ్రెషర్స్ డేలో జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో గన్ని భాస్కరరావు తదితరులు

రాజానగరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్య సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకమైనదని జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు పేర్కొన్నారు. జీఎస్ఎల్-స్వతంత్ర నర్సింగ్ కళాశాలల 2025 బ్యాచ్ ఫ్రెషర్స్ డే శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ వైద్య ప్రక్రియలో రోగుల చికిత్సలకు సంబంధించి వైద్యులు నిర్ణయాలు తీసుకుంటారని, సూచనలు చేస్తారని,అయితే వాటిని పూర్తిగా అమలు చేసేది నర్సులేనన్నారు. రౌండ్స్‌కు వెళ్లే వైద్యుల కంటే 24గంటలూ పర్యవేక్షించే నర్సులకే రోగుల లక్షణాలు గురించి తెలుస్తాయన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్సీ మూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, గీత ప్రవీణ పాల్గొన్నారు.

హాస్టల్ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలి

రాజమండ్రి కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి రాహుల్



బాలుర హాస్టల్ సందర్శనలో రాహుల్, వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): హాస్టల్ నిర్వహణ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని రాజమండ్రి కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని బాలుర వసతి గృహాన్ని ఆయన వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీతో కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ విషయంలో సిబ్బంది, విద్యార్థులు వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించాలని చెప్పారు. హాస్టల్ మెస్‌ను మరింత నాణ్యతగా ఏవిధంగా నిర్వహించవచ్చో రాహుల్ సూచించారు. సెంట్రల్ జైలులో తాము తీసుకున్న కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను వివరించారు. హాస్టల్ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. మంచిగా చదువుకుని ఉన్నతంగా జీవించాలన్నారు. విశ్వవిద్యాలయానికి అవసరమైన సహాయసహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బాయ్స్ హాస్టల్‌లోని వంట గదిని, మెస్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో వీసీ మాట్లాడి హాస్టల్ నిర్వహణ, మెస్ నాణ్యతపై ఆరా తీశారు. కార్యక్రమంలో హాస్టల్ చీఫ్ వార్డెన్ ఆచార్య కేఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శేఖర్ కార్టూన్‌కు ఉగాది బహుమతి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్ గీసిన కార్టూన్ ఉగాది బహుమతికి ఎంపికైంది. విశాఖపట్నంకు చెందిన సీసీఎఫ్ సంస్థ హాస్యానందం సౌజన్యంతో ఉగాది సదర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్టూన్ల పోటీల్లో శేఖర్ గీసిన కార్టూన్ అత్యుత్తమ కార్టూన్‌గా ఎంపికచేశారు. మహానుభావుడు బతికనంత కాలం వెంటిలేటర్ మీదకంటే బెయిల్ మీదే ఎక్కువకాలం ఉన్నాడంటూ గీసిన కార్టూన్‌ను ఎంపిక చేశారు. ఈ బహుమతిని ఆదివారం విజయవాడలో జరిగే కార్యక్రమంలో అందించనున్నట్టు ఓ ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు.



బహుమతికి ఎంపికైన కార్టూన్

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జాగ్రత్తగా ఉండాలి

• ఉపాధి పనులు ఉదయం 11గం.లకు పూర్తి చేయాలి
• తహశీల్దార్ శ్రీనివాస్

సీతానగరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు శనివారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో ఎంపీడీవో భారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువులలో ఉన్న నీటిని ఉపయోగించుకుని పశువులకు తాగునీరు అందించాలన్నారు. ఉపాధి హామీ పనులు ఉదయం 11 గంటలకు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో భారతి మాట్లాడుతూ పంచాయతీ పైప్ లైన్లు మరమ్మతులు రాకుండా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఏవీకే చైతన్య మట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున మధ్యాహ్న సమయంలో ప్రయాణాలు చేయరాదన్నారు. తప్పని సరి పరిస్థితిలో వెళ్లవలసి వస్తే తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

ప్రభుత్వాసుపత్రిలో అవినీతి చేస్తే ఇంటికే!

» ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం
» సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అందుకే అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో శనివారం నియోజకవర్గానికి సంబంధించి ఆరుగురు లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్ రూ.8 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవలు అందని పేదలకు ఈ విధంగా సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నట్టు తెలిపారు. ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటానని ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు సీఎం చంద్రబాబు పేదలను అన్నివిధాల ఆదుకుంటున్నారని చెప్పారు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిని 15 రోజులకు ఒకసారి సందర్శించి మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మార్చురీ వద్ద డబ్బులు అడిగితే కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అలా డబ్బులు డిమాండ్ చేసిన భవానిప్రసాద్‌ను విధుల నుంచి తొలగించామని వాసు చెప్పారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేదలను డబ్బుల కోసం డిమాండ్ చేస్తే ఉద్యోగులను ఇంటికి పంపించి వేస్తామని హెచ్చరించారు.

క్రీడాపోటీలు సంతోషంగా జరిగాయి

అసెంబ్లీ సమావేశాల్లో తమకు కావాలిసిన పనులను డిమాండ్ చేశామని ఎమ్మెల్యే వాసు అన్నారు. పుష్కరాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కోరామని చెప్పారు. ఎమ్మెల్యేల ఆటల పోటీలు సంతోషంగా జరిగాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, నాయుడు మాస్టర్, దుత్తరపు గంగాధర్, వీరా రాము తదితరులు పాల్గొన్నారు.

జీవరాశికి జలమే జీవనాధారం

» డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్
» ప్రపంచ జల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

రాజానగరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జలం లేకపోతే జీవరాశి మనుగడ లేదని, జలమే జీవనాధారమని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎన్.శ్రీ లక్ష్మి, భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.శ్రీనివాస్ సూచించారు. ప్రపంచ జల దినోత్సవాన్ని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) కాకినాడలోని ధరిత్రి రక్షిత సమితి, జిల్లా న్యాయ సేవల సంస్థ సంయుక్తంగా శని వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా ప్రతిఒక్కరూ అవసరం మేరకే పొదుపుగా వాడుకోవాలన్నారు. అలాగే గైట్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జల దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా వలంటీర్లు చక్రద్వారబంధంలోని హైస్కూల్‌ను సందర్శించి నీటి పొదుపు ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీపీసీబీ ఏఈఈ శ్రీరామచంద్రమూర్తి, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, ఎన్ఎస్ఎస్ పీవో బి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జియోసైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవంలో విభాగాధిపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ మనకున్న నీరు పరిమితం ఉందని, వృథాచేయకుండా పరిమితంగానే వాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జియోసైన్సెస్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫారమ్ పాండ్‌లను వినియోగించుకోండి

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
పలుచోట్ల ఫారమ్ పాండ్‌లకు శ్రీకారం



మధురపూడిలో ఫారమ్ పాండ్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల్లో ఆనందం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫారమ్ పాండ్(ఇంకుడు గుంత)లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఫారం పాండ్ ఏర్పాటు కార్యక్రమాన్ని పలుచోట్ల శనివారం చేపట్టారు. కోరుకొండ మండలం మధురపూడిలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి భద్రతతో భూగర్భజలాలు పెరిగి బంగారు భవిష్యత్‌ను ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బత్తిన అశోక్‌కుమార్, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేటలో ముత్యాల రామకృష్ణ పొలంలో ఫారమ్ పాండ్ ఏర్పాటును ఎంపీడీవో సాయిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో నీటికుంటల ఏర్పాటుకు ప్రభుత్వం సహకారం అందిస్తోందని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎలుగుబంటి సత్తిబాబు, ఎం.సాయిరాం, ఉండ విల్లి గిరిబాబు, మండవిల్లి గుప్త, ఉండవిల్లి గిరిబాబు, బలిరెడ్డి దుర్గారావు, పోతుల చిన్నికాపు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో రైతు దంగేటి వెంకటరత్నం పొలంలో ఫారం పాండ్ నిర్మాణపు పనులకు కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. మండలానికి 260 ఫారం పాండ్‌లను కేటాయించగా ఈనెలాఖరు నాటికి 40, మిగిలినవి జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయనున్నట్టు ఉపాధి ఏపీవో అప్పలరాజు తెలిపారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
» బుచ్చింపేటలో పల్లెబాట కార్యక్రమం



వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో అభివృద్ధి అంటే ఎలా ఉండాలో చేసి చూపించామని, విద్య, వైద్యం, వ్యవసాయం సహా అన్ని రంగాల్లో అభివృద్ధికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు.మండలంలోని బుచ్చింపేటలో శనివారం రాత్రి పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల కూటమి నాయకులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ కూడలి ప్రాం తాల్లో జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలు పరిష్కారానికి అర్జీలు తీసుకున్నారు. కొన్ని సమస్యలు అక్క డికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. పెద్ద సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభు త్వం నియోజకవర్గాన్ని అవినీతికి, దోపిడీలకు నిలయంగా మార్చిందని విమర్శించారు. దీంతో 25 ఏళ్లు వెనక్కి పోయిందన్నారు. తమ హ యాంలో అభివృద్ధి ఎలా ఉంటుందో 30 ఏళ్ల పాటు ప్రజలు గుర్తించుకునేలా పనిచేస్తామన్నారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్న మన్యం లక్ష్మి, మంగళం భద్రం, అత్తి పోసలు కుటుంబాలకు రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు

మధురపూడిలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. స్వామి వారి శేషమాల, శేషవస్త్రాలను అందజేశారు.

పీ4తో పేదరికం లేని సమాజ నిర్మాణం

వార్డు సభల్లో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



సభలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ నిర్మాణం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పీ4 విధానానికి శ్రీకారం చుట్టిందని మునిసిపల్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని 14 వార్డులకు సంబంధించి స్థానిక తుమ్మలావ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులోను, క్వారీ సెంటర్ శివాలయం వద్ద, నెహ్రూ నగర్ మునిసిపల్ స్కూల్ వద్ద, వీఎల్ పురం జంక్షన్ వద్ద జరిగిన వార్డులకు కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, సెక్రటరీ శైలజావల్లి, సిటీ ప్లానర్ కోటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 దిశగా రాష్ట్రంలో ఉన్న 20 శాతం అత్యంత పేదల అభ్యున్నతికి ప్రభుత్వం దాతలు, ప్రజలు భాగస్వామ్యంతో ఆర్థికంగా ఉన్న 10శాతం అధిక సంపన్నులు లేదా తెలుగు ప్రవాసుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని సాధించడానికి పీ4 విధానాన్ని చేపట్టారన్నారు. ఈ సభల్లో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

సీతానగరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని తహశీల్దార్ శ్రీనివాస్ బీఎల్‌వోలకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బీఎల్‌వో నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్‌తో పాటు ఎలక్షన్ డీటీ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల లిస్ట్‌లో తప్పులను గుర్తించి సరిచేయాలన్నారు. ఫార్మట్లను సరిగా పూర్తి చేయాలని, డెత్‌లు ఉంటే గుర్తించాలన్నారు. త్వరలో ఓటరు కార్డుకు ఆధార్ లింక్ చేస్తారన్నారు. ఫార్మ్ 6 ఓటరు నమోదుకు ఫార్మ్ 7 తొలగింపులకు ఫార్మ్ 8 సవరణలు బదిలీలుగా ఉపయోగించాలన్నారు.

సేద్యపు నీటి గుంతలకు శంకుస్థాపన

సీతానగరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) సీతానగరం మండలం, కూనవరం గ్రామంలో మాధవరపు కృష్ణార్జునరావు పంట భూమిలో సేద్యపు నీటి గుంతకు ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో నాగశేషవేణి శనివారం శంకుస్థాపన చేసారు. ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు రెండు మీటర్లు లోతు కలిగిన సేద్యపు నీటి గుంతకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ పనికి అంచనా విలువ రూ.38 వేలు కాగా 121 పనిదినాలతో సేద్యపు నీటి గుంటను ఏర్పాటు చేయనున్నట్టు ఏపీవో చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు

విశ్రాంత ఉద్యోగుల సమావేశం

చాగల్లు, మార్చి 22, (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ రీడింగ్ రూంలో శనివారం విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని ఆ సంఘం అధ్యక్షుడు కే.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఇందులో పీఆర్‌సీ బకాయిల విడుదల, డీఏలు చెల్లించాలని తీర్మానించారు. కార్యక్రమంలో సభ్యులు డీ.నాగేశ్వరరావు, గండి దానియేలు, సుశీలమ్మ, సత్యవాణి, తదితరులు పాల్గొన్నారు.

కాపునాడు రాజమండ్రి గౌరవ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దేవీచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాజమండ్రి కాపునాడు గౌరవ అధ్యక్షుడిగా ఆకుల వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లా అధ్యక్షుడు గుదే రఘు నరేష్, ముమ్మిడి వీరబాబు, విన్నా వాసు, దేశినీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వై-జంక్షన్‌లో చలివేంద్రం

రాజమమహేంద్రవరం కల్చరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వై-జంక్షన్ శ్రీ వీరాంజనేయ ఆటోస్టాండ్ వద్ద వైఎస్సార్ టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు అడపా వెంకటరమణ, అడపా అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బొంత శ్రీహరి, ఇసుకపల్లి శ్రీనివాస్, ఆటోస్టాండ్ ప్రతినిధులు పాల్గొన్నారు

సత్యదేవా నర్సరీని సందర్శించిన శిక్షణ బృందం

కడియం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, నర్సరీ మొక్కల పెంపకం, స్వయం ఉపాధిలో భాగంగా శిక్షణ నిమిత్తం ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన 70 మంది బృందం సభ్యులు శనివారం రాజమహేంద్రవరం గ్రామీణ ఫౌండేషన్ ద్వారా కడియపులంక పుల్లా అబ్బులు-సత్యదేవా నర్సరీని సందర్శించారు. నర్సరీ యాజమాన్యం వారికి మొక్కల గ్రాఫ్టింగ్, కటింగ్, ప్యూటీ కట్టుబడి తదితర విషయాలను వివరించారు. ఈ సందర్శన తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని శిక్షణ బృందం పేర్కొంది. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి డి.సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

ధవళేశ్వరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మూడో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సీహెచ్ రమ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. చిన్నారులపై జరిగే లైంగిక నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి తల్లిదండ్రులు, టీచర్లు పట్ల గౌరవభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ క్రాంతి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్మభూమి హాల్ట్‌కు 'గోదావరి రెడ్డి' వినతి

అనపర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అనపర్తి రైల్వే స్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ మంజూరు చేయించాలని విశాఖపట్నంకు చెందిన గోదావరి రెడ్డి కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. శనివారం విశాఖలో ఎమ్మెల్యేను కలిసిన ప్రతినిధులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జన్మభూమి హాల్ట్ కోసం ఇప్పటికే కేంద్ర రైల్వే మంత్రిని ఎంపీ పురందేశ్వరితో సహా కలుసుకుని విజ్ఞప్తి చేశామని, త్వరలోనే హాల్ట్ మంజూరవుతుందని అన్నారు.

కనిమా మసీదుకు రూ.5 లక్షలు విరాళం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణపురంలో కనిమా మసీదుకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రూ.5 లక్షలు విరాళం ప్రకటించారు. శనివారం రాత్రి మసీదు ప్రాంగణంలో జరిగిన ఇఫ్తారు విందుకు జనసేన నగర ఇంచార్జి అనుశ్రీ సత్యనారాయణ, నగర అధ్యక్షుడు వైశ్రీను, టీడీపీ నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, అల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత అబ్దుల్లా ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే వాసు ఇఫ్తార్ విందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము ప్రకటించిన విరాళం భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేస్తామన్నారు. ప్రభుత్వం త్వరలో వక్ఫ్‌బోర్డు కమిటీలు వేస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

ముస్లింలకు గన్ని కృష్ణ ఇఫ్తార్ విందు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ స్థానిక మెయిన్ రోడ్డులోని రాయల్ మాస్క్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. గన్ని కృష్ణతోపాటు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావులతో కలిసి విందు స్వీకరించారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలని ఆకాంక్షించారు. మసీదు అధ్యక్షుడు ఎస్ఎ కరీం, అసదుల్లా అహ్మద్, గఫూర్ అండ్ సన్స్ మాటూరి రంగారావు, మజ్జి రాంబాబు, శెట్టి జగదీష్, బుడ్డిగ రాధ, ఉప్పులూరి జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాలపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సాయికృష్ణ

దేవరపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు, బాల్యవివాహాలపై ప్రత్యేక చట్టాలున్నాయని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి న్యాయవిచారణ సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సాయికృష్ణ పేర్కొన్నారు. దేవరపల్లిలో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి సాయికృష్ణ మాట్లాడుతూ 2012 నవంబర్ 14 తేదీన లైంగిక వేధింపులపై ప్రత్యేక చట్టం వచ్చిందన్నారు. బాలికలపై హత్యాయత్నం, అత్యాచారం వంటివి జరిగితే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. న్యాయవాదులు కేశిరాజు అరవింద్, మర్రి వెంకటేశ్, సుధాకర్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, అంగన్వాడీ వర్కర్లు, టీచర్లు పాల్గొన్నారు.

తాళ్లపూడి: కొవ్వూరు మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై స్థానిక సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడు తూ పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. 2012లో ఏర్పాటు చేసిన ఈ చట్టం 18 ఏళ్ల వయస్సులోపు పిల్లలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. న్యాయవాదులు పి. హరీష్, వెంకట్రాజు, నంద పాల్గొన్నారు.



ఏమి హాయిలే ఇలా..

చెట్టు విలువ ఎప్పుడు తెలుస్తుందో తెలుసా.. ఒక పక్కన ఎండ మండిపోతూ ఉంటుంది.. మరో పక్కన నీడ కానరాదు..అలా వెళుతుండగా గుబురుగా చెట్లు కనిపించాయా ఆ ఆహ్లాదమే వేరు.. ఆ ఆనందమే వేరు.. ఎందుకంటే ఒక్కసారిగా అంతా కూల్‌కూల్‌గా మారిపోతోంది.. ఎంత ఎండయినా ఆ ఆహ్లాదం ఆస్వాదిస్తూ చెట్లు కింద నుంచి వెళుతుంటే ఏమి హాయిలే ఇలా అనిపించకమానదు.. రాజానగరం -అనపర్తి ప్రధాన రహదారికి ఇరు వైపులా ఫరిజెల్లిపేట సమీపంలోని రంగరాయ చెరువు వద్ద ఉన్న ఈ చెట్లు సమూహమే దానికి ఉదాహరణ.. ఉష్ణతాపంతో అల్లాడుతున్న ప్రయాణి కులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. రోడ్డుపై వెళు తున్న వాహనదారులతో పాటు గ్రామానికి చెందిన వారు సైతం మధ్యాహ్నం సమయంలో ఇక్కడకు చేరుకుని కొంతసేపు విశ్రమించిన అనంతరం బయలుదేరుతున్నారు. అందుకే మరి వృక్షో రక్షతి రక్షితః అనేది.. వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని అర్థం..

- రాజానగరం



అరె..టి మేళా భళా?

అరె అరటిలో ఇన్ని రకాలు ఉన్నాయా.. చూస్తుంటే కొత్తగా ఉందే.. అవును మరి అరటిలో రకాల గురించి అడిగితే ఎవరైనా సరే ఒకటో రెండో రకాలు చెబుతారు.. ఇక్కడ చూడండి ఎన్ని రకాలు ఉన్నాయో.. కొవ్వూరు అరటి పరిశోధన కేంద్రంలో శనివారం కిసాన్ మేళా నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని రకాల అరటి ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు.. అరటి రకాలను చూసి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆశ్చర్యపోయారు. అంతే కాదండోయ్ కంద, చేమ, పసుపు ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు.. పెద్దఎత్తున శాస్త్రవేత్తలు, రైతులు తరలివచ్చారు.

6



2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

అధికారులతో సమీక్షలో జేసీ

రాజమహేంద్రవరంరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 రబీసీజన్‌లో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా కార్యాచరణ అమలు చేయాలని జేసీ చిన్నరాముడు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో పౌరసరఫరాల, వ్యవసాయ, సహకార, తూనికలు కొలతలు, రవాణా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులతో సమావేశం నిర్వహించారు. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసేలా రైతు సేవా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకు రావాలని తెలిపారు. ఏప్రిల్ 1 నాటికి 216 రైతు సేవా కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కొనుగోళ్ల విషయంలో ఎస్‌వోపీ ఖచ్చితంగా పాటించాలన్నారు. మిల్లర్లు, జిల్లా యంత్రాంగం అంతా అనుసంధానంగా ఉండాలన్నారు. ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్లు సహకారం అందించి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్‌వో ఎస్.భాస్కరరెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి.రాధిక, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు నుంచి ఫోన్ చేశామని..

రూ.1.29 లక్షలు స్వాహా

రాజమహేంద్రవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ఈఎంఐ పేరుతో నగదు స్వాహా చేశారు. హుకుంపేటకు చెందిన శ్రీవిద్య గతేడాది అక్టోబరు 24న ఆదిత్య బిర్లా గ్రూప్ ద్వారా రూ.4లక్షలు లోన్ తీసుకున్నారు. ప్రాసెస్ చార్జీలు పోను రూ.3.76 లక్షలు ఖాతాలో క్రెడిట్ అయ్యింది. అదే నెల 24న ఆమెకు ఓ ఫోన్ వచ్చింది. ఆదిత్య బిర్లా నుంచి మాట్లాడుతున్నామని ఎక్కువగా ఈఎంఐ వేశారని ఇంకా తగ్గుతుందని ఆమెను నమ్మించి బ్యాంకు ఖాతా వివరాలు తెలుసుకున్నారు. మూడు రోజుల తర్వాత తన ఖాతా నుంచి రూ.1.49లక్షలు మాయమయ్యాయని శ్రీవిద్య జాతీయ సైబర్ క్రైం ఫిర్యాదుల నెం.1930కి కాల్ చేశారు. దానిపై బొమ్మూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్, ఎన్‌టీఆర్‌లకు **అవమానం** 8

నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

- లోపల పేజీలో



దారుణంగా చితికిపోతున్న బతుకులు

ఆ నాన్నకు పిల్లలను చంపాల్సిన అవసరం ఎందుకొచ్చింది..? ఆ దంపతులకు ఊపిరి తీసుకునేంత కష్టం ఎందుకొచ్చింది..? మరో యువకుడి బలవన్మరణానికి కారణం ఏంటి..? ఈ ప్రశ్నలన్నింటి వెనుక ఉన్నది ఒక్కటే జవాబు అదే అప్పు.. ఆ నాన్న తాను లేకపోతే తన పిల్లలను ఎలా చూస్తారోననే భయంతో తన కంటిని తానే పొడుచుకున్నాడు.. క్షణికావేశంలో కుమార్తెను బలి తీసుకున్నాడు.. జైలు పాలయ్యాడు.. కాకినాడకు చెందిన దంపతులు ఇంటిని నిర్మించి అప్పుల పాలయ్యారు.. ఆ ఇంటిని అమ్మేసినా అప్పులు తీరక గోదావరిలో దూకి తనువు చాలించారు.. కోనసీమ జిల్లా బండార్లంకకు చెందిన బాగా బతికిన ఒక కుటుంబం అప్పులు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతూనే ఉంది.

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఆర్థికంగా చితికిపోయి.. తమ చితిని తామే పేర్చుకొని లోకం విడిచి వెళ్లిపోతున్న వాళ్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ఇవాళ అత్యంత ఆందోళన కలిగించే అంశం. అప్పు అనే రెండక్షరాల ఊబి నుంచి బయటపడే అవకాశాలు కానరాక బలవంతంగా ఊపిరి తీసుకుంటున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చులు.. సంపాదనకు ఉన్న వ్యత్యాసం ఉసురుతీస్తోంది. నెలంతా కష్టపడితే ఖాతాలో పడే జీతం మూడు రోజుల్లో ఆవిరి అయిపోతూ.. మా మాటేమిటంటూ 27 రోజులు ప్రశ్నిస్తుండడం నడుమ పేద, మధ్యతరగతి జీవితాలు నలిగిపోతున్నాయి. పిల్లలను చంపి, తామూ చావడానికి ధైర్యం కూడగట్టుకుంటున్నారంటే మరణాలను రుణాలు శాసిస్తున్నాయనే వాస్తవం పదేపదే రుజువు అవుతూనే ఉంది. అప్పులు లేని పేద, మధ్య తరగతి జీవులు భూతద్దం పెట్టి వెతికినా ఒక్కరూ కానరాని రోజులు నడుస్తున్నాయి. ఓ పదేళ్ల కిందట ఆత్మహత్యలు చాలా తక్కువ. ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. ఏ కారణాలు చెప్పుకొన్నా ఆర్థిక ఇబ్బందులే అసలు రుగ్మత అనేది ఏవరూ కాదనలేని వాస్తవం. గతంతో పోలిస్తే ఈరోజు పిల్లల స్కూలు ఫీజుల దగ్గర నుంచి ప్లాట్‌ఫాంపై అమ్మకాలు సాగించే అరటి పండ్లతో సహా సుమారు 200 నుంచి 500 శాతం వరకూ ధరలు పెరిగిపోయాయి. నిత్యావసరాలు అంతే. దీంతో మనుగడకు అప్పులు తప్ప వేరే దారి కానరావడం లేదు. గతంలో కుటుంబ కలహాలు ఎక్కువగా ఉసురుతీస్తే ఇవాళ ఆ స్థానాన్ని ఆర్థిక ఇబ్బందులు భర్తీ చేస్తున్నాయి. ఒకప్పుడు ఇల్లు కట్టుకున్నా, కూతురు పెళ్లి చేసినా అప్పులు తప్పవని చెప్పేవారు. ఇవాళ స్కూలు ఫీజు కట్టాలంటే రుణాలకు వెళ్లక తప్పడంలేదు. పోలీసు రికార్డుల ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలో గత ఏడాది 230 మంది, జనవరిలో 30 మంది, ఫిబ్రవరిలో 20 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. అసలు రికార్డులకు ఎక్కనివి ఇంకో అన్ని ఉంటాయని చెబుతున్నారు. ఈ మరణాల్లో సుమారు 70 శాతం మందిని ఆర్థిక ఇబ్బందులే చంపేశాయని తెలుస్తోంది. నెలకు రూ.20 వేల నుంచి రూ. 30 వేలు వస్తున్నా నెలాఖరున అప్పులు చేయాల్సిన పరిస్థితి.

అనవసర ఆర్భాటాలతోనూ..

దురాశ.. దుఃఖానికి చేటు అనే విషయాన్ని జనం గుర్తించకపోవడం మరో కారణం. పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్టుగా.. ఎదుట వ్యక్తి సంపాదించేస్తున్నాడు. మనం కూడా ఏదో ఒక రకంగా సంపాదించాలి. ఖరీదైన బైక్‌లు కొనేయాలి. లగ్జరీ కార్లలో తిరిగేయాలనే అత్యాశకు, అనవసర బిల్డప్‌కు పోయి కొందరు చిక్కులు తెచ్చుకుంటున్నారు. ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు యువత వ్యసనాలకు బానిసవుతున్నారు. బెట్టింగ్, ఇతరత్రా జూదక్రీడలకు అలవాటు పడుతున్నారు. వీటిలో సంపాదించింది గోరంతైతే.. పోగొట్టుకునేది కొండంత. స్టాక్ మార్కెట్లు, షేర్లలో డబ్బులు పెట్టిన వారు ఎందరో నష్టాల బారినపడుతున్నారు. ఇవన్నీ బయటకు చెప్పుకోలేక లోలోపల సతమతవుతున్నారు. చేసిన అప్పులకు వాయిదాలు కట్టలేక కొత్త అప్పులు చేస్తున్నారు. ఇలా అప్పుల మీద అప్పులు చేసి కొందరు చివరకు ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఆర్థికంగా అగచాట్లు..

కొవిడ్ 19 తర్వాత చాలా మంది ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యాయి. కొన్నిచోట్ల పరిశ్రమలు మూతపడడం, చాలామంది ఉద్యోగాలు పోవడం.. చేసేందుకు పని కూడా దొరకని పరిస్థితి. చేసిన అప్పులు తీర్చలేక.. కొత్త అప్పు పుట్టక నానాయాతనపడ్డారు. మరోవైపు ఇదే సమయంలో అప్పులు ఇచ్చే ఫైనాన్షియర్లు కూడా సరైన హామీదారులు ఉంటేనే అదీ కూడా బాగా తెలిసిన వారైతేనే రుణాలు ఇస్తుండడంతో చాలా మంది ఆర్థిక అగచాట్లు పడుతున్నారు. మరోవైపు బ్యాంకులు కూడా సిబిల్ స్కోర్ బాగుంటేనే లోన్లు మంజూరు చేస్తుంటే.. అవీ సరిగా లేని సామాన్యులు నలిగిపోతున్నారు.

- ఆదాయాన్ని మించి ఖర్చులు
- అనవసర ఆడంబరాలు
- పెరుగుతున్న అప్పులు
- నలిగిపోతున్న జనం
- తీర్చలేక బలవన్మరణాలు
- కుటుంబాలూ బలి
- బ్యాంకు రుణాలు అధికమే
- జిల్లాలో రూ.91 వేల కోట్లు
- వ్యక్తిగతం రూ.13 వేల కోట్లు
- ప్రైవేటు అప్పులు అదనం

ఎందుకు చంపావ్ నాన్నా..

రాయవరం : తన కంటిని తానే ఎవడైనా పొడుకుంటాడా.. ఈయన అదే చేశాడు.. కన్న పిల్లలనే కాలువలో తోసేశాడు..అయితే కుమార్తె మృతిచెందగా...కుమారుడు బయటపడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరుకు చెందిన పిల్లి రాజు ఫైనాన్స్ వ్యాపారం చేసేవాడు. ఎంతో బాగా బతికాడు.. గ్రామంలో అందినకాడికి అప్పులు చేయడంతోపాటు కొంతకాలం కిందట ఇల్లు నిర్మించుకున్నాడు. దీంతో రొటేషన్ ఆగిపోయింది.. మరోవైపు అప్పులిచ్చిన వారి ఒత్తిడి పెరిగిపోవడంతో చనిపోదామని నిర్ణయించుకున్నాడు.. తను చనిపోతే తన పిల్లల పరిస్థితేంటని ఆలోచించాడు. ఈనెల 17న పిల్లలను తీసుకెళ్లి కాలువలో నెట్టేశాడు.. కుమార్తె మృతిచెందగా కుమారుడు బయటపడ్డాడు. చనిపోదామనుకున్నా ధైర్యం సరిపోలేదు. బంధువుల ఇంటికి వెళ్లగా వారు మందలించడంతో పోలీసుల ఎదుట లొంగిపోయాడు. క్షణికావేశంలో తీసుకున్న తొందరపాటు నిర్ణయం పచ్చని కుటుంబంలో తీరని శోకం మిగిల్చింది. ఏడేళ్ల అల్లారు ముద్దుగా పెంచి ఎందుకు ఆయువు తీశావు నాన్నా.. అంటూ చిన్నారి ఆత్మ ఘోషిస్తోంది.



అప్పులు తీర్చాలని అర్జీలు

కాకినాడలో ఓ పేద కుటుంబానికి చెందిన ఓ వివాహిత తన కుమార్తె వివాహానికి రెండక్షరాలున్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీ వద్ద ఇంటిని తాకట్టు పెట్టి రూ.15 లక్షల రుణం తీసుకుంది. ఆ మొత్తాన్ని చెల్లించలేకపోవడంతో ఇంటి జప్తునకు సదరు కంపెనీ నోటీసులు పంపింది. లబోదిబోమన్న ఆమె కంపెనీని వేడుకున్నా కనికరించలేదు. దీంతో ఈనెల 17న గ్రీవెన్స్‌లో కాకినాడ జిల్లా జేసీని కలిసి ప్రభుత్వం ద్వారా తన అప్పు తీర్చాలని వేడుకుంది. అవాక్కయిన జేసీ, లీడ్‌బ్యాంకు మేనేజర్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులను పిలిచి కొంత సమయం ఇవ్వాలని కోరినా వినకుండా మహిళ ఇంటిని జప్తు చేసేసుకుంది. దీంతో సదరు మహిళ నిలువనీడ కోల్పోయి తీవ్రంగా సతమతమవుతోంది.. ఇలా ఈమే కాదు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలాది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి బతకలేక.. బతుకుబండి ఈడ్చలేక నరకయాతన పడుతున్నాయి. తమ ఆర్థిక భారాన్ని ప్రభుత్వం తీర్చు తుందేమోననే అమాయకపు ఆశతో కొందరు జీవిస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు పలు అర్జీలు రావడమే నిదర్శనం. ఈ తరహా విజ్ఞప్తులు పిఠాపురం నియోజకవర్గం నుంచి భారీగా వెళ్లడంతో ఆమధ్య డిప్యూటీ సీఎం పవన్ సైతం అప్పులు తీర్చాలంటూ జనం విజ్ఞప్తి లేఖలు రాయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

బతుకు జీవుడా..!

కాకినాడ రూరల్ మండలానికి చెందిన నితీష్ మెడికల్ రిప్‌గా పనిచేసేవాడు.. వచ్చిన ఆదాయం సరిపోక అక్కడక్కడా అప్పులు చేశాడు.. చివరకు తన ఇంటిపై బ్యాంకులో లోన్ పెట్టి చిన్నచిన్న అప్పులు తీర్చేసి.. మిగిలిన సొమ్ముతో మెడికల్ బిజినెస్ చేశాడు. అయినా లాభంలేదు. ఓ పక్క బాకీదారుల ఒత్తిళ్లు, మరోపక్క పూటగడవని పరిస్థితులు.. కుటుంబమంతా కలిసి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. తర్వాత తమకున్న ఇంటిని అమ్మితే గట్టెక్కవచ్చని ఆలోచించారు. సొంతింటిని అమ్మేసి అప్పులు తీర్చేశారు. సామర్లకోట మండలం మాధవపట్నానికి చెందిన నరేంద్ర డిగ్రీ వరకు చదివి ఉద్యోగం కోసం కాకినాడ గాంధీనగర్‌కు చెందిన వెంకటేశ్వరరావుకు అప్పులు చేసి రూ.5 లక్షల వరకు సమర్పించాడు. ఒకసారి ఢిల్లీలో ఇన్‌కంటాక్స్ ఆఫీసులో ఉద్యోగం అని.. రెండోసారి రాష్ట్ర రాజధాని అమరావతి సెక్రటేరియేట్‌లో ఉద్యోగం చూశానని మోసగించాడు. ఓపక్క ఉద్యోగం పేరుతో మోసపోవడం, అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో ఆత్మహత్యే శరణ్యమని భావించి చివరికి పోలీసులను ఆశ్రయించాడు. వీరేకాదు.. ఎంతో మంది ఆర్థిక పరిస్థితులు తలకిందులై అనేక మంది బతుకు జీవుడా అని కాలం వెళ్లదీస్తున్నారు. కొవిడ్ తర్వాత సగటు జీవిబతుకు చిత్రం పూర్తిగా మారింది. చాలీచాలని వేతనాలు.. పెరుగుతున్న ధరలు అగాధంలోకి నెట్టేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా బ్యాంకుల్లో రుణాలు

రూ.91,089 కోట్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేలాది కుటుంబాలు పలు కారణాలతో బ్యాంకుల వద్ద వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్నారు. ఇది కాకుండా ఫైనాన్స్ కంపెనీలు, బంగారంపై రుణాలు ఇచ్చే సంస్థలు, వ్యాపారులంతా కలిపి ఉమ్మడి జిల్లాలోని అన్ని బ్యాంకుల బ్రాంచిల్లో రూ.91,089 కోట్ల రుణాలు తీసుకున్నాయి. కాకినాడ జిల్లాలో రూ.33,844 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.23,514 కోట్లు, తూర్పు గోదావరి జిల్లాలో రూ.33,731 కోట్లు. ఈ మొత్తంలో వ్యక్తిగత రుణాలు రూ.13 వేల కోట్లు పైనే. పేద, మధ్య తరగతి కుటుంబాలు బ్యాంకుల కంటే తాకట్టు, వడ్డీ వ్యాపారులు, ప్రైవేటు ఫైనాన్స్‌ల నుంచి తీసుకుంటున్న అప్పులే అధికమని.. ఆర్థిక సమస్యల్లో చిక్కుకుని ఆత్మహత్యల వరకు వెళుతున్న అనేక కుటుంబాల గురించి కాకినాడ జిల్లా బ్యాంకింగ్ నిపుణులు విశ్లేషించడం గమనార్హం.



తోకాడ సభలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే బత్తుల

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెంపు

రాజానగరంలో ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్

రాజానగరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పడితే నీటి ఎద్దడిని నివారించవచ్చని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.ఉపాధి హామీ పథకంలో రాజానగరం మండలం తోకాడ గ్రామంలో సేద్యపు నీటి కుంట (ఫామ్‌పాండ్) నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రధానంగా వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకుని,సేద్యానికి వినియోగించు కునేందుకు నీటి కుంటలు ఎంతో దోహదపడతాయన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నీరు ఎక్కడ సమృద్ధిగా ఉంటుందో అక్కడ అభివృద్ధి సాధ్యమన్నారు. దానికి గోదావరి జిల్లాలే ఉదాహరణ అన్నారు. ఉపాధి పథకంలో ఉచితంగా సేద్యపు కుంటలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.పంచాయతీ, ఇరిగేషన్, రెవెన్యూ స్థలాల్లో కమ్యూనిటీ ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఇంకుడు గుంటల కార్యక్రమాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎంఏవై పథకంలో భాగంగా మధ్యలో నిలిచిపోయిన గృహ నిర్మాణానికి మంజూరైన తొలి నగదు చెక్కును మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారు వేగి రాజేశ్వరికి అందజేశారు. సమావేశంలో జనసేన, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు బత్తుల వెంకటలక్ష్మి, నీరుకొండ వీరన్న చౌదరి, చాగల్నాడు కాలువ చైర్మన్ అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ వేగిశెట్టి రాజు, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి తదితరులు పాల్గొన్నారు.

బలభద్రపురంలో కేన్సర్ కేసులకు జల్లెడ

- 31 వైద్య బృందాలు ఏర్పాట్లు
- మూడు రోజుల పాటు ఇంటింటా సర్వే
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి

అనపర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి అంకాలజిస్టు సూచనల మేరకు ప్రత్యేక వైద్యం అందిస్తామని జిల్లా కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఇటీవల అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అసెంబ్లీలో బలభద్రపురం గ్రామంలో వందలాది మంది క్యాన్సర్ బారిన పడి చనిపోతున్నారని ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం అత్యవసరంగా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా శనివారం ఏడుగురు స్పెషలిస్టులు, 8 మంది వైద్యులు, 98 మంది వైద్య సిబ్బందితో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజారోగ్యంపై నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఇంటింటా సర్వే చేశారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ బలభద్రపురం చేరుకుని క్షేత్ర స్థాయిలో జరుగుతున్న ఇంటింటా సర్వేను పరిశీలించారు. 15మంది వైద్యులు, 98 మంది సిబ్బందితో 31 బృందాలుగా ఏర్పాటు చేసి ఇంటింటా సర్వే చేస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు ఈ సర్వే జరుగుతుందన్నారు. గ్రామంలో 2492 గృహాలు ఉన్నాయని 10 వేల జనాభా నివసిస్తున్నారని అన్నారు.ఇప్పటి వరకు సేకరించిన డేటా ఆధారంగా 23 మందికి వివిధ రకాల కేన్సర్ లక్షణాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరికి తదుపరి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. క్యాన్సర్ ప్రభావం ఉండడానికి గల కారణాలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల నుంచి జీజీహెచ్ ఆసుపత్రి నుంచి స్పెషలిస్టులను రప్పించామని తెలిపారు. క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న వారి వివరాలను సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె వెంకటేశ్వరరావు, కాకినాడ జీజీహెచ్ ఎస్పీఎమ్ హెచ్‌వోడీ డాక్టర్ పి సుజాత పాల్గొన్నారు.



బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

కేన్సర్, కిడ్నీ బాధితులు పెరిగారు : నల్లమిల్లి

బలభద్రపురం గ్రామంలో కేన్సర్ బాధితులే కాకుండా కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. చిన్నారులకు కాలేయ సంబంధిత వ్యాధులు సోకడం మరింత ఆందోళన కలిగిస్తుందన్నారు. గత రెండు రోజుల్లో నలుగురు చిన్నారులు వ్యాధి బారిన పడ్డారన్నారు. ఒక బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కూడా జరిగిందని.. తల్లిదండ్రులు సుమారు రూ.75 లక్షలు ఖర్చు చేశారన్నారు. ఒక్క గ్రామంలోనే ఇన్ని రకాల వ్యాధులు ఎందుకు ప్రబలుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. కేన్సర్ స్క్రీనింగ్ టెస్టుల కోసం మరో నోడల్ టీమ్‌ను గ్రామానికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించారన్నారు. ప్రజలు నామోషీ పడకుండా వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



సారా నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ చిన్న రాముడు

400 మందిపై బైండోవర్ కేసులు : జేసీ

రాజమహేంద్రవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నవోదయం 2.0ని అమలు చేస్తామని జేసీ ఎస్.చిన్న రాముడు స్పష్టం చేశారు. నవోదయం 2.0 పోస్టర్‌ని శనివారం ఆవిష్కరించి, అధికారులతో సారా నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. సారా తయారీదారులు, రవాణా చేస్తున్న నిందితులను సంస్కరించడం ద్వారా సత్ఫలితాలు సాధించడం సాధ్యమని సూచించారు.సారా తయారీ, రవాణా, విక్రయాలు చేసే సుమారు 400 మందిపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వీరంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొనే విధంగా చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. గంజాయి తదితర నిషేధిత మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై విస్తృతంగా ప్రచారం చేయడానికి ప్రచార రథాన్ని ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్, డీఆర్డీఏ, సెర్ప్, ఎక్సైజు, మునిసిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6 : 20 (ఆదివారం సాయంత్రం)

సహర్ : 4:43 (సోమవారం ఉదయం)

లైంగిక దాడులకు పాల్పడితే జైలుశిక్ష

● కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ

కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే ఏడు నుంచి 10 సంవత్సరాలు జైలుశిక్ష తప్పదని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏబీఎన్‌పీ ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ చిన్నారులను చిదిమేసే నీచులు ఎక్కడో ఉండరని, మనతో మంచిగా నటిస్తూ బంధువులు, ట్యూషన్ మాస్టార్లు, సన్నిహితుల రూపంలో మనచుట్టూనే ఉంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామ్మోహన్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వై. రమేష్, న్యాయవాదులు వీరంశెట్టి రాజావరప్రసాద్, సీహెచ్ శ్రీనివాస్, యు. సూరిబాబు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాలపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సాయికృష్ణ

దేవరపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు, బాల్యవివాహాలపై ప్రత్యేక చట్టాలున్నాయని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి న్యాయవిచారణ సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సాయికృష్ణ పేర్కొన్నారు. దేవరపల్లిలో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి సాయికృష్ణ మాట్లాడుతూ 2012 నవంబర్ 14 తేదీన లైంగిక వేధింపులపై ప్రత్యేక చట్టం వచ్చిందన్నారు. బాలికలపై హత్యాయత్నం, అత్యాచారం వంటివి జరిగితే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. న్యాయవాదులు కేశిరాజు అరవింద్, మర్రి వెంకటేశ్, సుధాకర్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, అంగన్వాడీ వర్కర్లు, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయాధికార సంస్థల ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీస్ కమిటీ కొవ్వూరు వారి ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై స్థానిక సచివాలయంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీని యర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడు తూ పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. 2012 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఈ చట్టం 18 ఏళ్ల వయస్సు లోపు పిల్లలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. న్యాయవాదులు పి. హరీష్, వెంకట్రాజు, నంద, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మండల సర్వ సభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాళ్లపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యువతను పక్కదారి పట్టించే గంజాయి, సారా వంటి మత్తుపదార్థాల కేసుల విషయంలో పట్టుబడ్డ ముద్దాయిలకు ఏ ఒక్క నాయకుడూ సపోర్టు చేయవద్దని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ప్రజాప్రయోజనాలు ఒక్కొక్కటి అభివృద్ధి దిశగా పనులు సాధించుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వం వదిలి పెట్టిన సంక్షేమ, సబ్సిడీ పథకాలను అమలులోకి తీసుకువస్తున్నామని, అలాగే ఎస్సీ ఎస్టీ, బీసీలకు రుణ సదుపాయాలు కలుగచేస్తున్నామన్నారు. గజ్జరం కాలనీ లేఅవుట్‌లో అప్రోచ్ రోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ గండి రాంబాబు, ఎంపీటీసీ చిన్నబ్బాయి కోరారు. దోమల బెడద నివారణకు ఫాగింగ్ మిషన్ కేటాయించాలని రావూరుపాడు ఎంపీటీసీ హరిబాబు తెలిపారు. మలకపల్లిలో డ్రైన్లు, రోడ్డు సౌకర్యం కావాలని ఎంపీటీసీ పూడి వరలక్ష్మి అభ్యర్థించారు. పంచాయతీ కార్యాలయంలో జరిగే కార్యక్రమాలకు సర్పంచ్, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వడం లేదని వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు అన్నారు. సమావేశంలో ముందుగా వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీ కొదాటి కనక లింగేశ్వరరావు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

మొండిగోడలకే పరిమితం!

● నిర్మాణాలకు నోచుకోని ప్రభుత్వ భవనాలు
● పట్టించుకోని అధికారులు



చిడిపిలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న భవన నిర్మాణాలు



కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి పంచాయతీల్లో సుమారు రూ. కోటితో గ్రామ సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతుభరోసా కేంద్రాలకు సంబంధించి నిర్మాణాలను ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ వాటిని పూర్తిచేయడంలో వైఫల్యం చెందింది. వివరాల్లోకి వెళితే కొవ్వూరు మండలంలో 19 సచివాలయాల భవనాలకు గాను పశివేదల - 2 కోర్టులో ఉండగా, 18 భవనాల పనులు ప్రారంభమయ్యాయి. అయితే వీటికి నిధులు మంజూరుకాకపోవడంతో చిడిపి, దేచర్ల, మద్దూరు, నందమూరు, బంగారంపేట గ్రామాల్లో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అలాగే 18 ఆర్‌బీకే భవన నిర్మాణాలు ప్రారంభించగా, అందులో 12 మాత్రమే పూర్తవ్వగా, 6 అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే 15 విలేజ్ క్లినిక్‌లకు 6 మాత్రమే పూర్తయ్యాయి. 9 భవనాలు మధ్యలో నిలిచిపోయాయి. నేటికీ గ్రామాల్లో భవనాలు మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. చిడిపిలో మూడింటిలో ఒక్కటీ పూర్తికాలేదు. దీంతో పిచ్చి మొక్కలు మొలిచి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేయాలని ఆయా పంచాయతీల ప్రజలు, తదితరులు కోరుతున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం

చాగల్లు, మార్చి 22, (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ రీడింగ్ రూంలో శనివారం విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని ఆ సంఘం అధ్యక్షుడు కే.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఇందులో పీఆర్‌సీ బకాయిల విడుదల, డీఏలు చెల్లించాలని తీర్మానించారు. కార్యక్రమంలో సభ్యులు డీ. నాగేశ్వరరావు, గండి దానియేలు, సుశీలమ్మ, సత్యవాణి, తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

గోపాలపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టం పై బాలికలు అవగాహన కలిగి ఉండాలని ప్యానల్ అడ్వకేట్ జాలపాటి చంద్రశేఖర్ అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం పై బాలికలు అవగాహన కలిగి ఉండాలని, 18ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, డబ్ల్యూహెచ్‌వో ఎం.సుభాషిణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారుల నియామకం

గోపాలపురం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 27వ తేదీన జరగనున్న ఉపసర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామాలకు ఎన్నికల అధికారులను నియమించారు. గోపాలపురం, కొవ్వూరుపాడు, వెంకటాయపాలెం గ్రామాలకు ఎన్నిక జరగాల్సి ఉంది. దీనికి సంబంధించి గోపాలపురం ఎన్నికల అధికారిగా నల్లజర్లకు చెందిన ఈఓపీఆర్‌డీ పీఎస్ఎస్ సింహాద్రిరావు, కొవ్వూరు పాడు ఎన్నికల అధికారిగా గోపాలపురం ఇన్‌ఛార్జి ఎంపీడీవో టీఎస్ఎస్ శ్రీనివాస్, వెంకటాయపాలెం ఎన్నికల అధికారిగా దేవరపల్లి ఈఓపీఆర్‌డీ రాజారావు నియమితులయ్యారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వాడపల్లి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వి. ఆనంద్ రాజు తెలిపారు. పాఠశాలలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎంపికచేసిన పరీక్షా కేంద్రాల్లో ఏప్రిల్ 27వ తేదీన ఎంట్రన్స్ పరీక్ష ఉంటుందన్నారు.

మైనర్ అదృశ్యంపై కేసు

గోపాలపురం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ మైనర్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కే.సతీష్‌కుమార్ శనివారం తెలిపారు. వివరాలివి.. ఇందులో గుడ్డిగూడెంకి చెందిన పెద్దపాటి రాజేష్‌పై అనుమానం ఉండటంతో పోక్సో కేసు కూడా నమోదు చేసినట్టు చెప్పారు. ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం శనివారం కోర్టులో హాజరుపరిచామన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు : మంత్రి



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలని, అలాగే నూతనంగా నియమి తులైన కమిటీ సభ్యులు కృషిచేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రం (ప్రభుత్వ ఆసుపత్రి) నూతన అభివృద్ధి కమిటి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా మంత్రి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య రక్షణకు పెద్దపీట వేస్తోంద న్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను అభినందించారు. మంత్రి చైర్మన్‌గా, సభ్యులుగా తూరుగోపు సాగర్, తిరుపతి సత్యనారాయణ, డాక్టర్ ఫయాజ్ అహ్మద్, చామంతి సాయిదుర్గ, టీ.కృష్ణవేణి, డీ.లక్ష్మీనారాయణ , తదితరులు ఉన్నారు.

● మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో వచ్చే ఏడాది నుంచే పనులు వాటి ప్రారంభం కానున్నాయని రాష్ట్ర మంత్రి దుర్గేష్ అన్నారు. శనివారం నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో కౌన్సిల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చడమమే ధ్యేయంగా ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ నిడదవోలు పట్టణ ప్రజలకు అమృత పథకంలో భాగంగా సుమారు రూ. 80 కోట్ల నిధులతో గోదావరి జలాలు అందించేందుకు మంత్రి ద్వారా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 2025-26 సంవత్సరానికి రూ.5.37 కోట్ల మిగులు బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. అనంతరం కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, వైస్ చైర్మన్ యలగాడ బాలరాజులు మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న పీ4 సర్వేపై కౌన్సిలర్లకు ఎటువంటి సమాచారం లేదన్నారు. మున్సిపల్ కమిషనర్, పలువురు అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

● లబ్ధిదారులకు చెక్కుల అందజేత

నిడదవోలు పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం 620 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ. 90,52,500 అదనపు ఆర్థిక సహాయ చెక్కును మంత్రి దుర్గేష్, జాయింట్ కలెక్టర్ చిన్న రాములు, ఆర్డీవో రాణి సుస్మిత అందజేశారు. వీరితో పాటు అధికారులు, తదితరులు ఉన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

నల్లజర్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మాదిగ కులం పేరుతో దూషించిన అనంతపల్లికి చెందిన సోమిశెట్టి గణేశ్, పోతవరం గ్రామానికి చెందిన చింత నాగేంద్రపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు.శనివారం రాత్రి నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు విచ్చేసిన ఎస్పీని కలిసి దళితులపై జరుగుతున్న దాడులు, దూషణల గురించి తెలిపారు. మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కండెల్లి శేఖర్, మోదగ సుబ్బారావు, గెరా శ్రీను, రాజేశ్వరరావు, సిద్ధుమర్రి శోభన్‌బాబు, రమేష్ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



మోటారు సైకిల్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

నిడదవోలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీడిపో సమీపంలో తాడేపల్లిగూడెం నుంచి రాజమండ్రి వెళుతున్న తాడేపల్లిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం నిడదవోలు బస్టాండ్ సమీపంలో మలుపు వద్ద మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. అదృష్టవశాత్తు మోటారు సైకిల్ నడుపుతున్న వ్యక్తి రెప్పపాటులో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయితే ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

కాలువలోకి దూకిన మహిళను రక్షించిన స్థానికులు

నిడదవోలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శెట్టిపేట బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని మహిళ శనివారం పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలోకి దూకేసింది. దీన్ని గమనించిన స్థానికులు సకాలంలో స్పందించి సదరు మహిళను రక్షించారు. అనంతరం మహిళకు కౌన్సిలింగ్ ఇంటికి పంపించేశారు.

సోమవారం డ్రైడేకి సహకరించాలి

చాగల్లు, మార్చి22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రతి సోమవారం డ్రైడేను నిర్వహిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి మహ్మద్‌అలీ తెలిపారు. ఇందులో భాగంగా నీటిసరఫరా చేసే వోహెచ్ ఎస్ఆర్ ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రపరిచి ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ బెట్టడం జరుగుతుందన్నారు. అందువల్ల ప్రజలు తమ అవసరం మేరకే నీటిని వాడుకుని పొదుపు చేయాలని ఆయన కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఉండ్రాజవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండల పరిషత్ సమావేశం ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వీఎస్ రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన జరుగుతుందన్నారు.దీనికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

2025-26 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలో బడ్జెట్ అంచనాలకు మున్సిపల్ కౌన్సిల్ శనివారం ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. 2025 జనవరి 27వ తేదీన 2025-26 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు, 2024-25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదించి జిల్లా కలెక్టర్ ఆమోదానికి పంపించారు. వాటిలో కలెక్టర్ కొన్ని మార్పులు చేశారు. సరిచేసి తీసుకువచ్చిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదించింది. కాగా గత కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ కౌన్సిలర్లు సభా మర్యాదను పాటించడం లేదని చేసిన వ్యాఖ్యలపై అధికార పార్టీ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్‌ల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ సభ జరుగుతుండగా మధ్యలో లేచి వెళ్లిపోవడం సభా మర్యాద కాదని ఆవేదన వ్యక్తం చేశానన్నారు.

సాధారణ సమావేశం వాయిదా

బడ్జెట్ ప్రత్యేక సమావేశంతో పాటు 20 అంశాలతో సాధారణ సమావేశాన్ని కౌన్సిల్ సభ్యులు వాయిదా వేశారు. దీనిపై పలువురు వైసీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రతినెలా 27వ తేదీన నిర్వహించే సాధారణ సమావేశాన్ని 22వ తేదీన ఏర్పాటుచేయడాన్ని వ్యతిరేకించారు. దీంతో చైర్‌పర్సన్ సాధారణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం కమిషనర్ టి. నాగేంద్రకుమార్ , బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ , రైల్వే పరిరక్షణ సమితి సభ్యుడు విల్సన్‌రాజు , టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, బత్తి నాగరాజు, అక్షయపాత్ర రవీంద్ర, కంటమణి రమేష్‌బాబు మాట్లాడారు. దీనిపై చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ రైళ్ల హాల్ట్‌లకు సంబంధించి ఈ నెల 24న జరగనున్న అత్యవసర సమావేశంలో తీర్మానం చేసి సంబంధితశాఖల అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. 23 వార్డుల కౌన్సిలర్లు, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, ప్రభుత్వశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ దుర్గాప్రసాద్

కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అధిక ఎండలు నమోదయ్యే అవకాశం ఉన్నందున గ్రామాలలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాని తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో వేసవి ఎండలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రహదారుల కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటుచేయాలన్నారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో కె. ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వి. సతీష్, దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్. ధర్మరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపులపై దాడులు



గంగోలు రెవెన్యూ పరిధిలో ఇసుక నిల్వలు పరిశీలిస్తున్న దృశ్యం

గోపాలపురం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): గంగోలు రెవెన్యూ పరిధిలో ఇసుక నిల్వలపై మైనింగ్ విజిలెన్స్, టాస్క్‌ఫోర్సు అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఇందులో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన భూమిలో 8 లారీల ఇసుకను నిల్వ చేసినట్టు తెలిసిందే. అయితే వాటిలో ఆరులారీలకు చెందిన బిల్లులను అధికారులకు సంబంధిత వ్యక్తి అందజేశారని, మిగిలిన రెండులారీలకు సంబంధించి బిల్లులు అప్పజెప్పాలని టాస్క్‌ఫోర్సు అధికారులు సూచించినట్లు తెలిపారు. బిల్లులు చూపించే వరకు ఇసుకను తరలించరాదని, బిల్లులు చూపించిన తరువాతే ఇసుకకు రిలీజ్ ఆర్డర్ ఇస్తామని, అప్పటి వరకు వీఆర్వో పర్యవేక్షించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. మైనింగ్ టీఏ శైలజ, జిల్లా టాస్క్‌ఫోర్సు ఎస్ఐ ప్రసాద్, వీఆర్వో శ్రీను, తదితరులు ఉన్నారు.

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్‌కి దరఖాస్తులు

కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ రౌండ్ - 2లో ఆసక్తి కలిగినవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కొవ్వూరు మెప్మా టీఎంసీ జేవీవీఎన్ భవాని తెలిపారు. ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం 21 నుంచి 24 సంవత్సరాల వయస్సు కలిగి, 10వ తరగతి నుంచి డిగ్రీ పూర్తిచేసి ఖాళీగా ఉంటున్న వారికి జిల్లాలోని టాప్ కంపెనీల్లో 12 నెలలపాటు ఇంటర్నషిప్ ఇస్తూ, ప్రతినెలా రూ.ఐదువేలు అంది స్తుందన్నారు. ఆ తరువాత మంచి జీతంతో ఉద్యోగం కల్పిస్తారన్నారు. ఐఐటీ, ఐఐఎం, నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థలలో డిగ్రీ పూర్తి చేసినవారు, సీఏ,సీఎంఏ, ఎంబీఏ, ఎంబీబీఎస్, ప్రస్తుతం అప్రెంటీస్‌గా ఇంటర్నషిప్‌లో ఉన్న వారు. అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగం లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు.

గుడ్డిగూడెంలో భూ రీసర్వే



భూ రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గోపాలపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు ఉపయోగపడతాయని తహశీల్దార్ కే. అజయ్‌బాబు అన్నారు. గుడ్డిగూ డెంలో శనివారం భూ రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఇందులో గతంలో నిర్వహించిన రీసర్వేకు ప్రస్తుతం నిర్వహించిన రీ సర్వేకు మధ్య రైతులకు ఎలాంటి ఇబ్బందులున్నా... వెంటనే రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ఉండ్రాజవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో వీఎస్ రామారావు అన్నారు. శనివారం ఉండ్రాజవరంలోని లింగాలపేట ఏరియాలో ఉపాధ్యాయులతోపాటు పర్యటించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల లోపుపిల్లలందర్నీ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎంఈవో సక్సేనరాజు మాట్లాడుతూ బడిబయట పిల్లలను గుర్తించి, వారిని బడిలో చేర్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నయోమి, ఉపాధ్యాయులు సునీత, శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ

●దూబచర్లలో ఉద్రిక్తత వాతావరణం
● రంగంలోకి దిగిన క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ● భారీ ఎత్తున పోలీసుల మోహరింపు



గాంధీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దృశ్యం

నల్లజర్ల, మార్చి22(ఆంధ్రజ్యోతి): దూబచర్ల గ్రామ పంచాయతీ పరిధి గాంధీకాలనీలో శనివారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తెల్లవారుజామున గుర్తు తెలియన వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశారు. శనివారం ఉదయం చూసిన స్థానికులు, అంబేడ్కర్‌వాదులు, మాలమహానాడు నేతలకు సమాచారం తెలపడంతో భారీ ఎత్తున తరలివచ్చి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న అదనపు ఎస్పీ సుబ్బరాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తమ సిబ్బందితో హుటాహుటిన చేరుకుని శాంతిభద్రతలను కల్పించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సంఘటనా స్థలానికి వచ్చి అంబేడ్కర్‌ను అవమానపర్చిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. రాస్తారోకో చేస్తున్న వారితో కలిసి రోడ్డుపై కూర్చొని సంఘీభావం తెలిపారు. మాజీ హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పల దండ వేసి అవమానపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఎస్పీకి వినతిపత్రం అందించారు. గోపాలపురం జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించి, శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. తర్వాత డీఎస్పీ దేవకుమార్, సీసీఎస్ సీఐ అనుకూరి శ్రీనివాస్, దేవరపల్లి సీఐ బీఎస్ నాయక్, నల్లజర్ల సీఐ విజయశంకర్ అంబేద్కర్ వాదులతో చర్చలు జరిపి అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేశారు కార్యక్రమంలో బోడిగడ్ల వెంకటేశ్వరరావు,కూరపాటి శ్రీను,అంబేద్కవాదులు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు పిల్లి కాంతారావు, గుడే సుబ్బారావు, బొడిగడ్ల రాంబాబు, శ్రీరాములు, ఆదినారాయణ, కీర్తి రాజు, బొడిగడ్ల రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యుగపురుషుడా మన్నించు!

● ముసుళ్లకుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానం
● వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మద్దిపాటి... విగ్రహానికి పాలాభిషేకంతో శుద్ధి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, సర్పంచ్ శారదాదేవి

నల్లజర్ల, మార్చి22 (ఆంధ్రజ్యోతి): ముసుళ్లకుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి అవమానం జరిగింది. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చెప్పులదండ వేశారు. ఉదయం చూసిన గ్రామస్థులు, టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు వెంటనే స్పందించి ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహానికి చెప్పులదండ వేసిన దోషులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు. గ్రామంలో గంజాయి బ్యాచ్ ఎక్కువగా ఉందని, మోటార్ వైర్లు, కోడి పుంజులు కూడా దొంగతనాలు గురువుతున్నాయని, వీటిపై దృష్టిపెట్టాలని అక్కడకి వచ్చిన పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నందమూరి శారదదేవి, రామకృష్ణ, కాకర్ల శేషగిరి, బొలుసు గంగరాజు, బొలుసు సుబ్బారావు, అయినపూడి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.